Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 235 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 14 సెప్టెంబర్ 2023 | గురువారం | పేజీలు : 4

## యూపీ బరిలో ఖర్గే!

లఖ్‌నవ్ : దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో మళ్లీ ఉనికి చాటుకునేందుకు, పార్టీని తిరిగి బలోపేతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సరికొత్త ఆలోచన చేస్తోంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆ రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని భావిస్తోంది. తద్వారా రాష్ట్రంలోని దళిత ఓటర్లను తనవైపు తిప్పుకోవచ్చని అంచనా వేస్తోంది. ఇప్పటిదాకా దళితులకు ప్రతినిధిగా పరిగణిస్తూ వచ్చిన బీఎస్పీ అధినేత్రి మాయావతి రాజకీయంగా బలహీనపడడంతో.. ఆ స్థానాన్ని తాము మాత్రమే భర్తీ చేయగలమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలైన ఇటావా, బారాబంకి నియోజవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి ఖర్గేను పోటీ చేయించేలా కాంగ్రెస్ ప్రణాళిక రూపొందిస్తోంది.

# చీకటి ఒప్పందాలు!!

# ఎవరికి ఎవరు జతో!




## టీ ఓటర్‌కి ఫుల్ కంఫ్యూజన్!!

హైదరాబాద్ : తెలంగాణ ఓటర్ కి ఫుల్ కంఫ్యూజన్ క్రియేట్ అయ్యేలా చేస్తున్నారు మహా నాయకులు. ఒకాయన వచ్చి బీజేపీ బీయారేస్ ఒక్కటే సుమా. వారికి ఓటేయద్దు అంటారు. మరోకాయన ఆ వెంటనే వచ్చి కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒక టీం సుమా వారితో జాగ్రత్త అంటారు. ఇంతకీ ఎవరు ఎవరితో పొత్తు. ఎవరికి ఎవరితో చీకటి ఒప్పందాలు. అసలెందుకు ఈ చిత్ర విచిత్ర ఆరోపణలు. ఎటు చూసినా తెర వెనక దోస్తీలు అంటూ బడా నాయకులు హడలెత్తిస్తున్న వేళ టీ ఓటర్ కి నిండా సందేహమే కలుగుతోంది అని అంటున్నారు. తెలంగాణాలో బీయారెస్ అధికారంలో ఉంది. రెండు తడవలుగా ఆ పార్టీనే తెలంగాణా ఏలుతోంది. హ్యాట్రిక్ కొట్టాలని ఆ పార్టీ చూస్తోంది. దాంతో సింగిల్ గానే ఈసారి పోటీ చేస్తోంది. ఆ మాటకు వస్తే గత రెండు సార్లూ ఒంటరి పోరుతోనే బీయారెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బీయారెస్ అనే రీసెంట్ గా జాతీయ పార్టీగా చెప్పుకునే ఒక ప్రాంతీయ పార్టీకి ఎవరు దోస్తులు, ఎవరు శత్రువులు అన్నది జనాలకు పెద్ద అయోమయంగా ఉంది. అలా అయోమయంలో ప్రజలని రాజకీయ నేతలే నెట్టేశారు. బీయారెస్ కి బీజేపీకి మధ్య స్నేహం ఉందని కాంగ్రెస్ నేతలు అంటారు. అందుకే ఆయన కుమార్తె కవిత మీద లిక్కర్ స్కాం కేసుల ఊసే లేకుండా పోయిందని అంటారు. తెలంగాణాలో బీజేపీ ప్రెసిడెంట్ గా ఉన్న బండి సంజయ్ ని తప్పించింది కూడా ఆ అండర్ స్టాండింగ్ లో భాగమే అని అంటారు. అందుకే బీయారెస్ కి ఓటేస్తే బీజేపీకి వేసినట్లే. కాబట్టి ఆ రెండు పార్టీలను పక్కన పెట్టేయండి అని అంటారు. ఇక కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అయితే మోడీ కేసీయార్ ఒక్కటే అని ఆరోపించారు. అటు ఖర్గే ఆరోపణలు అలా ఉండగానే ఖమ్మం సభకు వచ్చిన బీజేపీ పెద్ద, హోం మంత్రి అయిన అమిత్ షా బీజేపీకి బీయారెస్ కి మధ్య స్నేహమేంటి అని ఫైర్ అయ్యారు. ఉంటే గింటే వారి మధ్యనే ఉండాలని అన్నారు. బీయారెస్ మజ్లీస్ పార్టీలు రెండూ ఒక్కటే అన్నారు. అలాగే కాంగ్రెస్ బీయారెస్ కూడా ఒక్కటే అని అన్నారు. అన్నీ కుటుంబ పార్టీలే అని కూడా ఎకసెక్కమడారు. కాంగ్రెస్ ని ఫోర్ జీ అన్నారు. అంటే నాలుగు తరాల పార్టీ. బీయారెస్ టూజీ. రెండు తరాల పార్టీ, మజ్లిస్ త్రీజీ అంటే, మూడు తరాల పార్టీ. ఇలా కుటుంబ పాలన చేసే ఈ పార్టీలు అన్నీ ఒక్కటే వాటిని ఓటేయ్యద్దు అని అమిత్ షా గట్టిగానే జనాలను కోరారు. అటు ఖర్గే చెపినా ఇటు అమిత్ షా చెప్పినా జనాలు విన్నారు. వారికి అర్థం కానిది ఏంటి అంటే ఏ చీకటి స్నేహాలు ఏంటి అని, అలాగే మరో విషయం ఏంటి అంటే తమకు ఈ గోల ఎందుకు అని. బాగా పాలించే పార్టీ ఉంటే ఓటేస్తారు. లేకపోతే లేదు ఆయా పార్టీలు ఎవరితో దోస్తీ చేస్తున్నాయో సగటు ఓటరుకు అవసరమా అన్న చర్చ కూడా సాగుతోంది. అయితే తెలంగాణాలో ఇపుడు మూడు పార్టీలు ఉన్నాయి. ముఖా ముఖీ పోరు జరిగితే బీయారెస్ కి ఇబ్బంది. ఆ నేపథ్యంలో మూడు కాస్తా రెండు కావాలంటే విపక్షాలలో ఒక పార్టీ ఎలిమినేట్ కావాలి. ఎన్నికల్లో ఎలిమినేట్ అంటే ఓట్ల చీలిక తరువాతనే సాధ్యం. అప్పటికి జగరాల్సిన అనర్థం జరిగిపోతుంది. అందువల్ల ముందుగానే తప్పించేయాలి. జనాల మెదళ్లలో ఆ పార్టీ బీయారెస్ ఒక్కటే అనిపించాలి. అందుకే బీజేపీ కాంగ్రెస్ ని బీయారెస్ జట్టు కట్టేస్తోంది. కాంగ్రెస్ అయితే బీజేపీ బీయారెస్ ఒక్కటే అని చెబుతోంది.

అయితే ఈ రెండు పార్టీలు ఇలా పరస్పరం వేసుకున్న ఎత్తుల ఫలితం ఎంటో తెలియదు కానీ కామన్ గా మాత్రం బీయారెస్ ఉంటోంది. బీయారెస్ అంత బలమైన పార్టీయా అన్న చర్చ కూడా జనాల బుర్రల్లోకి వెళ్తోంది. ఏది ఏమైనా టీ ఓటర్ కి మాత్రం ఫుల్ కంఫ్యూజన్ పెట్టేలాగానే నేతల స్పీచులు ఉన్నాయి. ఇది అటు తిరిగి ఇటు తిరిగి ఏ పార్టీకి లాభం చేకూరుస్తుందో చూడాల్సిందే.

## జమిలి ఎన్నికల పేరుతో కేంద్రం జిమ్మిక్కులు



నల్గొండ : జనవరి 16 లోపు తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయని.. జమిలి ఎన్నికల పేరుతో కేంద్రం జిమ్మిక్కులు చేస్తోందని.. శాసన మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. నల్గొండలోని తన నివాసంలో గుత్తా మాట్లాడుతూ.. ఎన్నికలు దగ్గర పడ్డాయంటూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. వైఎస్ షర్మిల లాంటి సమైక్యవాదులు రాష్ట్రంలో చొరబడ్డారని విమర్శించారు. తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తలా ఒకదారి ఎంచుకున్నారని గుత్తా పేర్కొన్నారు.

## తెలంగాణలో విప్లవం మొదలైంది.. నీ పతనం తథ్యం కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో యువతకు ఆశలు కల్పించిన కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ మాయమైపోయారని బీజేపీ నేత డీకే అరుణ ప్రశ్నించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సెంటిమెంట్ పేరుతో కేసీఆర్ నిరుద్యోగ యువత ప్రాణాలు బలి తీసుకున్నారని ఆరోపించారు. 12 వందల మంది ఉసురుపోసుకొని గద్దెనెక్కిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు. అసెంబ్లీ సాక్షిగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న కేసీఆర్.. నిరుద్యోగులుగానే ఉంచారన్నారు. నిరుద్యోగ ఆశలను కేసీఆర్ నెరవేర్చలేదని.. ఇప్పటి వరకు డీఎస్సీ వేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి ప్రశ్నపత్రాలు లీక్ చేశారని..ప్రశ్నపత్రాలు లీక్ చేసిన వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రశ్నపత్రాలు లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోలేదంటే ప్రభుత్వం హస్తం ఉన్నట్లే అని బీజేపీ నేత ఆరోపించారు. కాంట్రాక్ట్ వ్యవస్థ ఇంకా ఎందుకు నడుస్తుందో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు లబ్ధి పొందేందుకు అనేక ప్రకటనలు ఇస్తు మరోసారి మోసం చేశారన్నారు. ప్రకటనల పేరుతో పాలాభిషేకాలు చేయించుకోవడానికి కేసీఆర్‌కు సిగ్గు ఉండాలన్నారు. తెలంగాణ ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తావు కేసీఆర్ అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, రెండు పడక గదుల ఇళ్లు ఎక్కడికి పోయాయి కేసీఆర్ అని నిలదీశారు. ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేసిన కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ఒక బోగస్ అని అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు అంచనాలు పెంచి.. అడ్డగోలుగా ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. పూర్తి కానీ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సిగ్గు లేదా అంటూ విరుచుకుపడ్డారు.

"తెలంగాణలో విప్లవం మొదలైంది కేసీఆర్.. నీ పతనం తథ్యం" అని హెచ్చరించారు. రాష్ట్రంలో మార్పు జరగాలని.. అది బీజేపీతోనే సాధ్యమని డీకే అరుణ పేర్కొన్నారు.



## దేశం గర్వపడేలా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నది : మంత్రి తలసాని

సిద్దిపేట : దేశం అబ్బుర పడే విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండ పోచమ్మ రిజర్వాయర్‌లో ఉచిత చేప, రొయ్య పిల్లలను వదిలారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకునే గొప్ప మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యరంగం నిర్లక్ష్యం చేయబడింది. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి నేడు ఒక్క అవకాశం ఇవ్వమనడం వారి దివాళాకోరు తనానికి నిదర్శనం అన్నారు. తెలంగాణలో ఎవరు ఊహించని రీతిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుంటే కండ్లు ఉండి కూడా చూడలేకపోతున్న కబోదులు అని ప్రతిపక్షాలపై మండిపడ్డారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ వంటి పథకాలతో సాగులో అద్భుతమైన ప్రగతిని సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మత్స్య ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, వైస్ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.

## ఎన్నికలప్పుడు టెంట్లతో స్టంట్లు చేయడమే కాంగ్రెస్ పని : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు దగ్గర పడగానే టెంట్లు వేసి స్టంట్లు చేస్తది. టెంట్లతో స్టంట్లు వేయడమే కాంగ్రెస్ పని. తెలంగాణ రాష్ట్రం పట్ల బీజేపీకి బరువు లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆ పార్టీలపై మండిపడ్డారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం మంత్రి మీడియా సమావేశంలో మట్లాడారు. ఇవాళ రూ.19 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒకప్పుడు హుస్నాబాద్‌లో అన్ని గుంతల రోడ్లు ఉండేవి  ఇప్పుడు అన్ని సీసీ రోడ్లుగా మారయన్నారు. దాదాపుగా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రూ.7752 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాం. 2500 కోట్ల రూపాయలతో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేశాం. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి రెండు పంటలకు ఢోకా ఉండదన్నారు. తెలంగాణ కోసం కేంద్రంలో కొట్లాడం కాంగ్రెస్ చేతకాదు. 60 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని,కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం బాధ్యత లేదని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఏమన్నా అభివృద్ధి జరిగిందా..? అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ సమాజం మూడోసారి కేసీఆర్ను ముఖ్యమంత్రి చేద్దామని ప్రజలే సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకున్నారని చెప్పారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి చూసి నేర్చుకుని మీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీకి మంత్రి సూచించారు. నిందలు వేయడంతో పాటు మతతత్వ రెచ్చగొడుతున్న పార్టీ బీజేపీ. వచ్చే ఎన్నికల్లో అబద్ధాల కాంగ్రెస్‌కు అభివృద్ధి సాధించిన బీఆర్ఎస్ పార్టీ విజయాలకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్కటైనా అమలు చేసిందా..? చర్చకు నేను సిద్ధమని కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఎన్ని ట్రిక్కులు చేసిన కేసీఆర్ మూడోసారి సీఎంగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీష్ కుమార్ మూడోసారి గెలువడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## జీ20 కి భారత్ పెట్టిన ఖర్చు ఇది... దక్కే ఫలితాలివి!

ఇండియా వేదికగా జరిగిన అత్యంత కీలకమైన జీ-20 సదస్సు రెండు రోజుల పాటు జరిగిన సంగతి తెలిసిందే. అత్యంత ప్రాముఖ్యమైన ఈ సదస్సుకు ఈ సారి ఇండియా వేదికగా నిలిచింది. ఈ సమయంలో ఈ సదస్సుకు ఇండియా పెట్టిన మొత్తం ఖర్చెంత అనేది ఆసక్తిగా మారింది. ఈ సమయంలో అందుకు సంబంధించిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవును... జీ-20 సదస్సుకోసం 30 మంది దేశాధినేతలతో పాటు 14 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు హాజరయిన సంగతి తెలిసిందే. దీని కోసం కేంద్రం ఎంత ఖర్చు చేసిందనే వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ సమయంలో జీ20 సమావేశాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మోడీ సర్కార్... న భూతో న భవిష్యత్ అన్నట్లుగా ఏర్పాట్లు చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునక్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, బంగ్లాదేశ్ ప్రధానితో సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నాయకులు హాజరయ్యారు. ఈ సమయంలో ఈ స్థాయిలో ఏర్పాట్లు చేసిన శిఖరాగ్ర సమావేశానికి ప్రతిఫలంగా భారత్ కు దక్కే ప్రతిపలమేంటనేది కూడా ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ముందుకు ఈ సదస్సుకు అయిన ఖర్చు కు సంబంధించి వస్తోన్న కొన్ని నివేదికల ప్రకారం.. జీ20 సమ్మిట్ కోసం ఢిల్లీని రెడీ చేసేందుకు కేంద్రం రూ.4254.75 కోట్లు వెచ్చించినట్లు తెలుస్తుంది. రోడ్లు, సెక్యూరిటీ, లైటింగ్ తో పాటు ఇతర పనుల కోసం ఈ డబ్బును ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని శాఖల నుండి ఈ వ్యయం ఖర్చు చేయడం జరిగిందని అంటున్నారు. ఆ సంగతి అలా ఉంటే... ఈ సదస్సు ద్వారా భారత్ కు కలిగే ప్రయోజనాలేమిటి.. ఈ శిగరాగ్ర సమావేశం వల్ల ఒనగూరే ఫలితాలేమిటి అనేది ఆసక్తిగా మారింది. ఈ క్రమంలో... భారత్, అమెరికా మధ్య ఆర్థిక సంబంధాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో... ఇలాంటి పరిస్థితుల్లో జి20 సమ్మిట్ ద్వారా ఈ బంధం మరింత బలంగా మారనుందని అంటున్నారు. ఇదే సమయంలో... చైనా, అమెరికా మధ్య పెరుగుతున్న వాణిజ్య యుద్ధం ద్వారా భారతదేశం లాభపడే అవకాశం ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. చైనాలో అమెరికన్ ఐఫోన్ల వినియోగంపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఇది భారత్ కు కలిసొచ్చే అంశం అని అంటున్నారు. కారణం... అమెరికన్ కంపెనీలకు పెద్ద ఆప్షన్ గా ఇండియా మారనుంది. ఇండియా – అమెరికా దేశాల మధ్య రెన్యూవబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ పై ఒప్పందం కుదిరింది. దీనికోసం రెండు దేశాలు కలిసి ఒక బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఇది పునరుత్పాదక శక్తి, గ్రీన్ టెక్నాలజీని ప్రోత్సహించడానికి అవకాశాన్ని అందిస్తుందని తెలుస్తుంది. ఇదే సమయంలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఇండియా ప్రధాని మోడీ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ధాన్యం ఒప్పందంతోపాటు ఎం.ఎస్.సి.ఏ. ఫైటర్ జెట్ ఇంజిన్ కు సంబంధించి ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతాయని అంటున్నారు. ఈ సమయంలో ప్రపంచంలోని 19 శక్తివంతమైన దేశాల నాయకులు ఇండియాలో సమావేశమయ్యారు. ఈ దేశాలు భారతదేశానికి రావడం వల్ల పెట్టుబడులు పెరుగుతాయని అంటున్నారు. తదనుగుణంగా కొత్త ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడతాయని చెబుతున్నారు.

# యమ డేంజర్



ఖమ్మం : విజయవాడ-జగదల్‌పూర్ 30వ నంబరు జాతీయ రహదారిపై పాల్వంచ పరిధిలో ప్రమాదకర ప్రాంతాలు (బ్లాక్ స్పాట్స్) నిత్యం రక్తసిక్తంగా మారుతున్నాయి. నవభారత్ శివారు నుంచి పాతపాల్వంచ జెన్కోకాలనీ వరకు ఇటీవల పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవించాయి. నవభారత్ ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి, 150 ప్లాంట్ యూనిట్‌కు వెళ్లే మార్గం వద్ద యూటర్న్ ఉంది. కొత్తగూడెం వైపు నుంచి వచ్చే భారీ లారీలు, ట్రక్కులు ఇక్కడ యూటర్న్ తీసుకుంటాయి. కొన్ని ట్యాంకర్లు, టిప్పర్లను రహదారి పక్కన నిలుపుతుంటారు. రద్దీ కారణంగా రోజూ ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటోంది. నవభారత్ ప్రధాన కూడలిలో కొందరు ఆటోలను రోడ్డుపైన నిలుపుతున్నారు. ఫలితంగా శేఖరంబంజర వైపు వెళ్లాలన్నా, అటునుంచి వచ్చేవారు యూటర్న్ తీసుకోవాలన్నా అవస్థలుపడాల్సి వస్తోంది. కొత్తగూడెం నుంచి చాతకొండ మీదుగా వచ్చే బైపాస్ రోడ్డు నవభారత్ వద్ద కలుస్తోంది. స్థానికంగా కర్మాగారంలో పనిచేసేవారితో పాటు.. అటుగా రాకపోకలు సాగించేవారు వేగంగా.. ఒక్కసారిగా రోడ్డుపైకి వస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆత్రుత, అతివేగం, రోడ్డు నిబంధనలపై అవగాహన లేకపోవడంతో పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని.. ఈ నెల 19న నవభారత్ సమీపంలో హైవేపై చేపల లారీ ఢీకొన్న ఘటనలో కొత్తగూడెం చిట్టిరామవరం తండాకు చెందిన పదేళ్ల బాలుడు మోనీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ బుధవారం మృత్యువాతపడటంతో విషాదం నెలకొంది. ఎర్రగుంట వైపు వెళ్లేందుకు సైకిల్‌పై హైవే దాటుతున్న నాగేశ్వరరావును కారు ఢీకొంది. దీంతో కుడికాలు మోకాలి పైభాగం వరకు కోల్పోయాడు. నాలుగు నెలల క్రితం జరిగిన ఘటన ఇది.

హైవేపై బ్లాక్ స్పాట్లు ఎక్కడున్నాయంటే..

ప్రభుత్వ మెడికల్ కళాశాల క్రాసింగ్

కేఎస్ఎం వసతి గృహాలకు వెళ్లే దారి

పాలకొయ్యతండా రోడ్డు ప్రాంతం (కలెక్టరేట్ సమీపంలో)

స్పాంజ్ ఐరన్ కాలనీ వద్ద

నవభారత్ కర్మాగారం '150' యూనిట్, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లే మలుపు

నవభారత్ ప్రధాన కూడ

ఎన్ఎండీసీ కర్మాగారం వద్ద(సంజయ్‌నగర్)

ఎర్రగుంటకు వెళ్లే మార్గం

జెన్కోకాలనీ కూడలి

జాతీయ రహదారిపై అన్ని కూడళ్లలో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. పాదచారుల కోసం కూడళ్లకు అనుసంధానంగా జీబ్రా గుర్తులు ఏర్పాటు చేయిస్తాం. పాదచారులు, వాహనదారులు వాహనాల వేగాన్ని అంచనా వేయడం ముఖ్యం. కూడళ్లలోని సూచికలను వాహనదారులు అనుసరించాలి. యూటర్న్ తీసుకునేటప్పుడు, సర్వీసు రోడ్లపైకి మారేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలి. మూలమలుపులు, ఎత్తుపల్లాల వద్ద డివైడర్లపై ఉన్న మొక్కల కారణంగా కుడి, ఎడమ వైపు నుంచి వచ్చే వాహనాలు దగ్గరగా వచ్చే వరకు కనిపించడం లేదు. ఆయా సమయంలో నెమ్మదిగా ప్రయాణించడం మేలు.ఎన్. వెంకటేశ్, డీఎస్పీ, పాల్వంచ

# కంటికి ఇంపుగా...



ఖమ్మం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో సందడిగా కొనసాగుతోంది. జనవరి 18న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖమ్మం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ భవనంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల రోజులుగా సాగుతున్న శిబిరాల్లో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎంతోమంది పరీక్షలు చేయించుకున్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 57 బృందాలను నియమించి సేవలందిస్తున్నారు. గ్రామాలు, వార్డులను యూనిట్‌గా తీసుకుంటూ ఒక్కో కేంద్రంలో ప్రతి రోజు 125–140 మందికి పరీక్షలు చేస్తున్నారు. కళ్లద్దాలు పంపిణీకంటి వెలుగును ఇప్పటి వరకు 126 గ్రామ పంచాయతీలు, 33 పట్టణ వార్డుల్లో పూర్తి చేశారు. శిబిరాల్లో లబ్ధిదారులకు ఆధునిక పరికరాలతో పరీక్షలు చేసి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. అనంతరం తప్పనిసరైన వారికి అక్కడే చదివే అద్దాలు అందజేస్తున్నారు.

ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరమైన వారి వివరాలను నమోదు చేసుకుంటూ తయారీ కోసం ఇండెంట్ పెడుతున్నారు. దాదాపు 24.35 శాతం మందికి రీడింగ్ గ్లాసులు అందజేశారు. అలాగే 14.64 శాతం మందికి ఇవి అవసరమని తేల్చారు. ఇక నేత్ర చికిత్సలు తప్పనిసరైన వారిని జిల్లా సర్వజన ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు. అక్కడ కంటి విభాగంలో వైద్య నిపుణులు పరీక్షించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తిస్తున్నారు.ప్రభుత్వం 18 ఏళ్ల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు చేయాలని సూచించింది. ప్రతి ఒక్కరూ చేయించుకోవాలి. కళ్లజోళ్లు అవసరమైనవారు తప్పనిసరిగా తీసుకోవాలి. చికిత్సలు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆస్పత్రులకు పంపిస్తున్నాం. వైద్య నిపుణుల సలహా మేరకు వారికి అవసరమైన చికిత్సలు చేయిస్తున్నాం. డాక్టర్ మాలతి, డీఎంహెచ్‌వో

# పునరాకృతే పరిష్కారం

ఖమ్మం : జిల్లాలోని సాగర్ కాల్వలను నిర్మించి నాలుగు దశాబ్దాలు దాటింది. నాటి పరిస్థితులకు అనుగుణంగా తూములు నిర్మించారు. పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తేనే మైనర్లలోని చివరి ఆయకట్టుకు నీరు అందుతుంది. నీటిని తగ్గించి విడుదల చేస్తుండటంతో యాసంగి పంటలకు తడి అందక రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల జరుగుతున్న ఆందోళనలకు ఇది ప్రధాన కారణంగా నిలుస్తోంది

బీబీసీకి సగమే విడుదల

నాడు బోనకల్లు బ్రాంచి కాలువ(బీబీసీ) 1370 క్యూసెక్కుల సామర్థ్యంతో 85వేల ఎకరాల నీటి సరఫరా చేసేలా తవ్వారు. నేడు లక్ష ఎకరాలకు పైగా సాగవుతోంది. కానీ 800 క్యూసెక్కులు మించి నీరు విడుదల చేయడం లేదు. అందులో ప్రారంభంలో ఉన్న కొణిజర్ల, చింతకాని మండలాల రైతులు సగానికి పైగా వినియోగించుకుంటున్నారు. బోనకల్లు వచ్చేసరికి 400 క్యూసెక్కులకు మించి రావడం లేదు. ప్రస్తుతం రైతులు యాసంగి వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు.

రెగ్యులేటర్లు నిర్మిస్తే తప్ప..బీబీసీ పరిధిలో ఉన్న కలకోట, నారాయణపురం, పోలంపల్లి, ఆళ్లపాడు మేజర్ల తూములు ఎత్తులో నిర్మించారు. ఆళ్లపాడు వద్ద మరీ ఎత్తులో ఉండటంతో పూర్తి స్థాయిలో నీళ్లు వస్తేనే ఈ మేజర్లకు నీళ్లు వెళ్తాయి. కలకోట మేజర్ కింద సుమారు పది వేల ఎకరాలు, ఆళ్లపాడు మేజర్ కింద 3వేల ఎకరాలు సాగవుతోంది.



దీంతో నీళ్లు అందక రైతులు బీబీసీకి అడ్డుకట్ట కట్టుకోవాల్సి వస్తుంది. ఏన్కూరు ప్రధాన కాలువలోనూ ఇదే పరిస్థితి. కాలువకు రీడిజైనింగ్ చేసి కాలువ సామర్థ్యం పెంచడం, శిథిలావస్థలో ఉన్న కాలువను మరమ్మతులు చేసి లైనింగ్ చేయించడం చేయాలి. మధిర మండల రైతులకు ఆంధ్రాతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా కాలువని తీయాల్సి ఉంది. మేజర్ల తూముల వద్ద రెగ్యులేటర్స్ ఏర్పాటు చేయాలి. సాగర్ నుంచి ఎడమ కాలువకు 11,754 క్యూసెక్కులు రావాలి. కేవలం 6వేల క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. వాటిలో మూడు జోన్లకు విడుదల చేయాలి. త్వరలో తూముల వద్ద రెగ్యులేటర్ల ఏర్పాటు చేస్తాం. ప్రతిపాదనలు పంపించాం.శ్రీనివాసరావు, డీఈ

# అక్కరకు రాకుండానే ఆయుష్షు తీరుతోంది..

ఖమ్మం : ఉరుకులు.. పరుగుల జీవితంలో కొంత సమయమైనా ఆరోగ్యం కోసం కేటాయించాలనుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. దీనికి తగిన వాతావరణం లేకపోవడం సమస్యగా మారింది. ముఖ్యంగా ప్రకృతితో మమేకమై ఊరట పొందటానికి జనం ఆరాట పడుతున్నారు. ఇట్లాంటి పరిస్థితుల్లో ప్రకృతి వైద్యాన్ని అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆరోగ్య స్వస్థత కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో వీటి కోసం షెడ్లు నిర్మించినా ఎలాంటి సేవలు ఇంతవరకూ అందుబాటులోకి రాలేదు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఆయుష్ విభాగం కింద భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 12 ఆరోగ్య స్వస్థత కేంద్రాలు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు) ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.6లక్షలు మంజూరు చేశారు. స్వస్థత కేంద్రంలో యోగా షెడ్డు నిరించి, ఇక్కడకు వచ్చే వారి కోసం తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం ఏర్పాటు చేశారు. కేంద్రంలో ప్రకృతి వైద్యంపై శిక్షణ, యోగా, ఫిజియోథెరపీ వంటి వైద్య చికిత్సలు అందించాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం



లేదు. అక్కడక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా, ఆశా కార్యకర్తలకు శిక్షణ, వంటింటి వైద్యంపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు.

సిబ్బంది నియామకం ఎన్నడో..ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిక్షకుడు, సీహెచ్‌వో, ఫార్మసిస్టు, పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వహించాలి. యోగా శిక్షకులను ఎక్కడా నియమించలేదు. రూ.లక్షల నిధులతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రభుత్వం నిర్మించి ఏడాది కావస్తున్నా జిల్లాలోని ఏ కేంద్రంలోనూ యోగా శిక్షణ ప్రారంభించలేదు. సిబ్బందిని నియమించకపోవడంతో తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కాంట్రాక్టు పద్ధతిపై యోగా శిక్షకులను తీసుకోవాలని నిర్ణయించినా తరువాత ఆ విషయం గురించి అధికారులు పట్టించుకోలేదు.జిల్లాలో 11 చోట్ల షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఒక్క చోట మాత్రమే మరికొంత పని ఉంది. ఇంతవరకు యోగా శిక్షకులను నియమించలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. సిబ్బందిని నియమిస్తే ఆయా సేవలు ప్రారంభిస్తాం.డాక్టర్ కె.రాజేందర్‌రావు, ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌ఛార్జ్

# వంతెన మరమ్మతులకు మోక్షం

మహదేవపూర్ : పెద్దంపేట వంతెన మరమ్మతులు పూర్తికావస్తున్నాయి.. గత వర్షాకాలంలో భారీ వరదలకు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. తాజాగా కట్ట పటిష్ఠం చేస్తూ పనులు చేపడుతున్నారు. దీంతో రాకపోకల సమస్య తీరనుంది.. జిల్లాలో 2022 జులైలో రికార్డు స్థాయి వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. గోదావరి తీర ప్రాంతమైన మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, కాటారం మండలాల ప్రజలు ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అడవిలో తలదాచుకున్నారు. పలు ప్రాంతాల్లో చిన్న వంతెనలు, రహదారులు కొట్టుకుపోయాయి. మహదేవపూర్-పలిమెల మండలాలకు పెద్దంపేట వంతెన పై నుంచి రాకపోకలు సాగుతాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నీరు, గోదావరి, పెద్దంపేట వాగు ఉద్ధృతితో వంతెన దెబ్బతినడం, కొంత రహదారి మార్గం కొట్టుకుపోయి రవాణా మార్గం నిలిచింది. తాత్కాలిక మరమ్మతులు చేసి రవాణా పునరుద్ధరణ చేపట్టారు. వరద ఉద్ధృతి పెరిగితే వంతెన పూర్తిగా దెబ్బతింటుందని ప్రజలు భయాందోళన చెందారు. సుమారు 18 గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడ్డారు.



పెద్దంపేట వంతెన సమస్యపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో రహదారి మార్గం మరమ్మతులు పూర్తి చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రూ.72 లక్షలతో..

పలిమెల మండలానికి రహదారి రాకపోకలు సాగడానికి మరమ్మతులు పూర్తయినా వంతెన కింది భాగంలో దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో వరద ఉద్ధృతికి మరింత నష్టం కలిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రకృతి, ప్రమాదాల నివారణ, రహదారి భవనాల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్నారు. రూ.72 లక్షల నిధులతో దెబ్బతిన్న ప్రాంతంలో మట్టి, కంకర పోసి రివిట్‌మెంట్ పనులు చేస్తున్నారు. ఆయా పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇలా ప్రణాళికతో వంతెన నిర్మాణం పటిష్ఠం చేస్తే ఆయా ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

కుదురుపల్లి వంతెనకు దిక్కేది?

మహదేవపూర్-కాళేశ్వరం రహదారి మార్గంలో ప్రధానమైన కుదురుపల్లి వంతెన ప్రమాదకరంగా మారినా మరమ్మతులు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన ఓ వైపు దిమ్మెలు కింద పడి, కొంత భాగంలో దెబ్బతింది.. భారీ వర్షాలు, వరదలకు వంతెన ఆవరణలో భారీ స్థాయిలో మట్టి కొట్టుకుపోయి పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. వాహనదారులు వంతెన పై ప్రయాణిస్తూ పలు సందర్భాల్లో ప్రమాదాల బారినపడ్డారు. పెద్ద స్థాయిలో ప్రమాదాలు జరగకముందే వంతెన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# కమలం.. ఎవరికో అదృష్టం!

మహబూబాబాద్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. భారాస ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు చేసింది. ఇక కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తూ 100 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందంటూ ధీమాతో ఉన్నారు. భాజపా నుంచి కూడా బరిలోకి దిగేందుకు ఆశావహులు పోటీపడుతున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తు చేశారు. ఈ ప్రక్రియ ఆదివారం ముగిసింది. పార్టీ పెద్దలు పరిశీలించి ఈ నెల 17 తర్వాత తొలి జాబితా ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. మొదటి జాబితాలో చోటు ఎవరికి దక్కుతుందో అని ఉత్కంఠ నెలకొంది. 12 నియోజకవర్గాల నుంచి వరకు 67 మంది దరఖాస్తు చేశారు. కావడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి, కటంగూరి రాంనర్సింహారెడ్డి, సుంకరి మనోహర్, వేముల రాజాగౌడ్, లింగంపల్లి వీరగోపాల్, దాసరి కిరణ్ టికెట్ ఆశిస్తున్నారు. 2018లో పోటీ చేసిన కీర్తిరెడ్డికే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

వర్ధన్నపేట నుంచి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జన్ను మధు, పోలేపాక మార్టిన్ లూథర్, పంజా వెంకటేశ్వర్లు, దేవరకొండ అనిల్, పద్మ, చిటూరి అశోక్, బన్న ప్రభాకర్ బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జనగామ నుంచి ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, బేజాడి బీరప్ప, ప్రేమలతారెడ్డి, తిరుపతి రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు.

డోర్నకల్ నుంచి లక్ష్మణ్‌నాయక్, నర్సింహులపేట జడ్పీటీసీ సభ్యురాలు సంగీత, మదన్‌లాల్, గుగులోతు దేవిక, బుల్లెట్ కృష్ణ టికెట్ ఆశిస్తున్నారు. పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, డాక్టర్ కాళీప్రసాదరావు, డాక్టర్ విజయచందర్, డాక్టర్ ఎస్.సంతోష్ ప్రయత్నాల్లో ఉన్నారు. పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, బానోతు రాంకోటి, కర్ర శ్రీనివాసరెడ్డి, దుబ్బ రాజశేఖర్‌గౌడ్, పాకనాటి దామోదర్‌రెడ్డి, దొంగరి మహేందర్ తమ దరఖాస్తులను అధిష్ఠానానికి సమర్పించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, బొజ్జపల్లి సుభాష్, మాదాసు వెంకటేశ్, చిలుక విజయరావు టికెట్ కోరుతూ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వినతులు అందించారు.

ములుగు నుంచి కృష్ణవేణి నాయక్, భూక్య జవహర్‌లాల్, తాటి కృష్ణ, రాజునాయక్, ఉత్తమ్‌కుమార్, దేవ్‌సింగ్ దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి చందూలాల్ కుమారుడు ప్రహ్లాద్ పార్టీలో చేరి టికెట్ ఆశించాలని అనుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వరంగల్ తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ వన్నాల వెంకటరమణ, గంట రవికుమార్, కుసుమ సతీశ్, అల్లం నాగరాజు దరఖాస్తులు అందజేసి టికెట్ కోసం ఎవరికి వారు ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది.

మహబూబాబాద్ నుంచి ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. యాప శీతయ్య, జాటోత్ హుస్సేన్ నాయక్, యల్ది నాగలక్ష్మి, బాలునాయక్, వెంకన్నతో పాటు మరొకరు ఉన్నారు.

వరంగల్ పశ్చిమలో రావు పద్మ, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, చాడ స్వాతిశ్రీనివాస్‌రెడ్డి పోటీ పడుతున్నారు. దాదాపు రావు పద్మకే ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం.

నర్సంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు, బుర్రి ఉమాశంకర్, పార్టీ బహిష్కృత నాయకుడు గడ్డం ఆంజనేయులు పోటీ పడుతున్నారు.

# ఆర్టీసీ గమ్యం

మహబూబాబాద్: ఆర్టీసీ... ప్రజారవాణా సంస్థ.. ప్రయాణికులకు చేరువ కావడానికి కృషి చేస్తోంది. వివిధ పథకాలు ప్రవేశపెడుతోంది.. ఆదాయాన్ని పెంచుకోవడానికి మార్గాలు అన్వేషిస్తోంది.. అందివచ్చిన అవకాశాలన్నింటినీ ఉపయోగించుకుంటోంది. రాయితీలూ ప్రకటిస్తోంది. పండగలు, ప్రత్యేక రోజులను సమర్థంగా ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతోంది. సంస్థ ఇటీవల మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. బస్సు ఎక్కడుంది.. ఎప్పుడు వస్తుందో తెలుసుకునేలా 'గమ్యం' పేరుతో బస్సు ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో టీఎస్‌ఆర్టీసీ పేరుతో యాప్ ఉన్నా అందులో పూర్తి స్థాయిలో సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దాని స్థానంలోనే సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఈ యాప్‌ను రూపొందించారు. గమ్యం యాప్‌లో సమాచారం మొత్తం ఉంటుంది. ప్రయాణికులు తాము ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. మనం ఉన్న ప్రాంతానికి ఎన్ని గంటలకు వస్తుంది, డ్రైవర్, కండక్టర్ల వివరాలు, ఫోన్ నంబర్లు కనిపిస్తాయి. దూర ప్రాంత సర్వీసులకు రిజర్వేషన్ నంబర్ ఆధారంగా బస్సులను ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్టీసీ తొమ్మిది డిపోల పరిధిలోని పల్లెవెలుగు మినహా ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని సర్వీసులకు ప్రత్యేకంగా ట్రాకర్‌ను అమర్చారు. దీనిని జీపీఎస్ ద్వారా యాప్ అనుసంధానం చేశారు. దీనిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రత్యేకంగా వ్యక్తి గత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదు.

మహిళల కోసం ప్రత్యేక ఫీచర్ మహిళల భద్రతకు ప్రత్యేక ఫీచర్ తెచ్చారు.



ప్రయాణ ప్రాంగణాలు లేని చోట, రాత్రి బస్సుల కోసం ఎదురుచూసే సమయంలో కలిగే ఇబ్బందులను అధిగమించేందుకు 'ఫ్లాగ్ ఏ' అనే ఫీచర్ ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచి మరుసటి ఉదయం 6 గంటల వరకు ఇది అందుబాటులో ఉంటుంది. మహిళా ప్రయాణికులు తమ వివరాలు ఫీచర్‌లో నమోదు చేయగానే ఆకుపచ్చని లైట్ తెరపై వెలుగుతుంది. దీనిని ఆ రూట్లో వచ్చే ఏ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చూపించినా వెంటనే బస్సు ఆపుతారు. క్షేమంగా గమ్యస్థానాలకు చేరే విధంగా ఈ ఏర్పాట్లు చేస్తారు.

పోలీసులకూ సమాచారం చేరవేయవచ్చు అత్యవసర పరిస్థితుల్లో ఎస్‌వోఎస్ బటన్ ద్వారా ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చు. డయల్ 100, 108కు కూడా యాప్‌ను అనుసంధానం చేశారు. నేరుగా పోలీసులకు సైతం సమాచారం ఇవ్వవచ్చు. బస్సు బ్రేక్ డౌన్, వైద్య సహాయం, రోడ్డు ప్రమాదం తదితర వివరాలను యాప్ ద్వారా ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు రిపోర్టు చేయవచ్చు. ఆ రిపోర్టు ఆధారంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

# చెప్పేదే రాసుకో.. ఇచ్చేదే తీసుకో..!



ఖమ్మం : గతేడాది వైరా రిజర్వాయర్‌లో వదిలేందుకు గుత్తేదారులు లక్ష చేపపిల్లలు తీసుకురాగా.. మత్స్యకార సంఘం సభ్యులు పట్టుబట్టి లెక్కకట్టారు. కేవలం 30 వేల చేపపిల్లలు ఉన్నట్లు తేలటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతర్వాత నాణ్యత లేని రొయ్యపిల్లలు సరఫరా చేస్తున్నారంటూ వాటిని తిప్పి పంపించారు. సత్తుపల్లి మండలంలోని చెరువులకు తక్కువ పరిమాణం, నాసిరకం చేపపిల్లలు సరఫరా చేశారంటూ గతేడాది మత్స్యకారులు ఆందోళలకు దిగారు. భారీగా సంఖ్య తగ్గించి గుత్తేదారులు సరఫరా చేసినట్లు తేలింది. చాలా చెరువుల్లో పోసిన చేపపిల్లలు నాసిరకమైనవి కావడంతో కొంతకాలానికే మృత్యువాతపడ్డాయి.

చేపపిల్లల పంపిణీలో అక్రమాలు మళ్లీ వెలుగుచూస్తున్నాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోటపాడు చెరువులో ఈనెల 4న చేపపిల్లలను వదులుతున్న సమయంలో అవకతవకలు బట్టబయలయ్యాయి. గుత్తేదారు తెచ్చిన చేపపిల్లలను లెక్కించగా 75 వేలకు 54 వేలు మాత్రమే సరఫరా చేసినట్లు గుర్తించారు. మత్స్యకార కుటుంబాలకు దన్నుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం రాయితీపై చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ఏటా అక్రమాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పెడచెవిన పెడుతుండటంతో గుత్తేదారులు 'చెప్పేది రాసుకో.. ఇచ్చేది తీసుకో' అన్నట్లు వ్యవహరిస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. మత్స్యశాఖలోని కొందరు అధికారుల అండదండలతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటా లెక్క ప్రకారం చేపపిల్లలను వదులుతున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా ఆస్థాయిలో చెరువుల్లోకి చేరడం లేదు.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం జిల్లాలోని 903 చెరువుల్లో 3.62 కోట్ల చేపపిల్లలు, భద్రాద్రి జిల్లాలోని 743 చెరువుల్లో 1.77 కోట్ల చేపపిల్లలు వదలాలని మత్స్యశాఖ నిర్ణయించింది. వీటిని ప్యాకెట్ల రూపంలో డ్రమ్ములు, ప్లాస్టిక్ కవర్లలో గుత్తేదారులు సరఫరా చేయాల్సి ఉంటుంది. 35–40 ఎంఎం పిల్లలను కవర్లలో, 80–100 ఎంఎం పిల్లలను డ్రమ్ముల్లో పంపిణీ చేస్తారు. ఓ ప్యాకెట్‌లో 1,000 పిల్లలు వస్తే లక్ష పోయాల్సిన చెరువులకు 100 ప్యాకెట్లు కేటాయిస్తారు. డ్రమ్ముల్లో చేపపిల్లలను కిలోల చొప్పున తూకం వేస్తారు. కిలోకు ఎన్ని పిల్లలు వస్తాయో లెక్కించిన తర్వాత డ్రమ్ములను కాంటా వేస్తారు. ఉదాహరణకు కిలోకు 300 పిల్లలు వచ్చాయనుకుంటే.. డ్రమ్ము 100 కిలోలుంటే అందులో 30 వేల పిల్లలు ఉన్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఎక్కడా ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది అధిక వర్షాల కారణంగా లక్ష్యం నెరవేరలేదు. ఈసారి మొదట్లో వర్షాలు లేకపోవడం, ఆతర్వాత చెరువులు అలుగులు పారడం వల్ల చేపపిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యంగా మొదలైంది.

ఈ నెల 4 నుంచి ఖమ్మం జిల్లాలో చేపపిల్లలను చెరువుల్లో వదిలే ప్రక్రియ మొదలుపెట్టాం. రెండు నెలల్లోపు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తిచేస్తాం. పిల్లల పరిమాణం, సంఖ్యలో తేడా వచ్చినా గుత్తేదారుకు నోటీసులిస్తాం. రఘునాథపాలెం మండలం కోటపాడులో తక్కువగా వచ్చిన 21 వేల చేపపిల్లలను సరఫరా చేయాలని గుత్తేదారుకు సూచించాం. ఆంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

# గురువుల విన్నపాలు వినవలె!



ఖమ్మం : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల సందర్భంగా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఈనెల 8 నుంచి 11 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతులు( అప్పీల్స్) స్వీకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పది కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్‌కు మూడు మండలాలు కేటాయించారు. జిల్లావ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు వచ్చి తమ విన్నపాలను వివరిస్తున్నారు. మొత్తం 10 మంది ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది వీటిని పరిశీలిస్తున్నారు. శనివారం వరకు సుమారు 200 మంది ఉపాధ్యాయులు తమ వినతులు అందజేశారు. ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం కోలాహలంగా మారింది.

హెచ్ఎంలు.. ఆర్‌జేడీ కార్యాలయంలో..కొంతమంది హెచ్.ఎం.లు విన్నపాలు ఇచ్చేందుకు వస్తున్నారు. ఎఫ్ఏసీ హెచ్ఎంలవి మాత్రమే స్థానికంగా తీసుకుంటున్నారు. రెగ్యులర్ హెచ్ఎంలు మాత్రం వరంగల్‌లోని ఆర్‌జేడీ కార్యాలయంలో వినతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయం తెలియక కొంతమంది వస్తున్నారు. జిల్లా నుంచి వరంగల్‌కు వెళ్లేందుకు వ్యయప్రయాసలు తప్పడం లేదు.

మెడికల్ బోర్డు ఏర్పాటు...జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. వీటిలో ఎక్కువ అక్రమాలు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ సారి ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చిన 21 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. జీఓ నెంబరు.5 ప్రకారం క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ/లివర్/హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్ బాధితులకు ప్రాధాన్యం ఇస్తారు. మానసికంగా, ఇతర తీవ్రమైన కొన్ని వ్యాధులతో బాధపడే పిల్లలున్న ఉపాధ్యాయులకు నిబంధనల మేరకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీటికి సంబంధించిన ధ్రువపత్రాలు ఆసుపత్రుల నుంచి ఇస్తే చెల్లవు. సదరం ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలి. అవి సక్రమమైనవేని బోర్డు ధ్రువీకరించాలి. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు.

ప్రధాన సమస్యలు ఇవే...

సీనియారిటీ జాబితాలో వరుస క్రమం తప్పుగా ఉండటం

ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతుల జాబితాలో పేరు లేకపోవటం

తొలుత ఎస్జీటీగా ఉద్యోగంలో చేరి.. ఏడాది తర్వాత పరీక్ష రాసి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన వారు.. తమ పూర్వ సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని కోరటం

సీనియారిటీ సరిగా లేనందున సవరించాలనడం

ర్యాంకు నమోదులో అవకతవకలు

సీనియారిటీ జాబితాలో సీనియారిటీ నమోదు కాకపోవడం

ప్రిఫరెన్షియల్ క్యాడర్‌లోని మెడికల్, వితంతు, స్పౌజ్ నమోదు కాకపోవడం

స్పౌజ్ కేసులు కొన్ని నమోదు కాకపోవడం

పాఠశాలల పేర్లు తప్పుగా ఉండటం

317 జీఓలో బదిలీ అయిన కొంతమంది ఉపాధ్యాయులు 40 శాతం వైకల్యం ఉన్నప్పటికీ.. కోర్టు తీర్పు ప్రకారం తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరటం.

రేపు తుది జాబితా విడుదల

–సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

ఉపాధ్యాయుల నుంచి నేటి వరకు వినతులు స్వీకరిస్తాం. వాటిని పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటాం. తప్పులుంటే వాటిని సరిచేస్తాం. ఉపాధ్యాయులకు న్యాయం చేస్తాం. బదిలీలకు సంబంధించిన తుది జాబితా ఈ నెల 12న విడుదల చేస్తాం. వెబ్ ఆప్షన్లు 13న నమోదు చేసుకుంటారు. మొత్తం 3,852 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# అతివల అభ్యున్నతిపై ముందుచూపు



కొత్తగూడెం : ఆర్థిక, సామాజిక అభివృద్ధితోనే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల అతివల అభ్యున్నతికి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా పలు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, చిరు వ్యాపారాలు, చిన్న యూనిట్ల స్థాపన, క్రయవిక్రయాలు, ఇతర కార్యకలాపాలకు ఆర్థిక సహాయం సమకూర్చుతోంది. సంఘాలు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో కొనసాగిస్తున్న కార్యక్రమమే 'విజన్ బిల్డింగ్'.'విజన్ బిల్డింగ్' అనేది అయిదేళ్ల లక్ష్యంతో కూడుకున్న కార్యక్రమం. గతేడాది ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, ఆర్థిక అక్షరాస్యత స్థాయి పెంపు, నైపుణ్యాల గుర్తింపు, సాంకేతికాభివృద్ధి, ఆదాయ సృష్టే దీని లక్ష్యం. ముందుచూపుతో ఆలోచించి ప్రణాళికలు తయారు చేయడం, వాటిని ఫలవంతంగా అమలు చేయడం'విజన్ బిల్డింగ్' ముఖ్య ఉద్దేశం. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి జిల్లా అధికారులకు హైదరాబాద్‌లో శిక్షణ కూడా అందించారు. వారు జిల్లాలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిబ్బందికి మండల స్థాయిలో మెలకువలు నేర్పించారు. వారు తొలి విడత పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన సుజాతనగర్, భద్రాచలం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ప్రణాళికలు రూపొందించారు.

ప్రోత్సాహానికై మహిళల ఎదురుచూపు

తొలి విడతగా ఎంపిక చేసిన మండలాల్లో సెర్ప్ అధికారులు స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. వారి వ్యాపారాల్లో అభిరుచులు, నైపుణ్యాలు గుర్తించారు. వారికి ఆర్థిక, విద్య, నైపుణ్యాల శిక్షణ అందించేందుకు అమలు చేయదగిన ప్రణాళికలు సిద్ధం చేశారు. డాక్యుమెంటరీలు రూపొందించి ఉన్నతాధికారులకు ఇప్పటికే అందించారు. రెండో విడతగా కార్యక్రమాన్ని మరో మూడు మండలాలైన చంద్రుగొండ, ములకలపల్లి, పినపాకలో అమలు చేయనున్నారు. సిబ్బంది ఆయా మండలాల్లో సర్వేలు నిర్వహించి ప్రణాళికలు తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందనున్నాయోనని తొలి విడత మండలాలకు చెందిన సభ్యులు ప్రస్తుతం ఎదురుచూస్తున్నారు. ఉపాధి భరోసాకు అండ లభిస్తుందని ఆశిస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా ప్రణాళికలు

– మధుసూదన్‌రాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి

స్వయం సంఘాల సభ్యుల అభ్యున్నతికి 'విజన్ బిల్డింగ్'లో భాగంగా తగిన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. రెండో విడత కింద ఎంపికైన మూడు మండలాల్లో ప్రణాళికల తయారీకి సెర్ప్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితుల ఆధారంగానే కార్యక్రమాల రూపకల్పనకు సిఫార్సు చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా 'విజన్ బిల్డింగ్' అమలు చేస్తాం.

# ఖాళీ ప్లాట్లు.. దోమలతో పాట్లు

మహబూబాబాద్:రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నగరంలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తున్నాయి. దోమ కాటుతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో దోమల సమస్యకు ప్రధాన కారణం కాలనీల్లో ప్రైవేటు ఖాళీ స్థలాలేనని తేల్చారు. ఇళ్ల మధ్య సంవత్సరాల తరబడి వృథాగా ఉంటున్న ఖాళీ స్థలాలు(ప్లాట్లు) వ్యర్థాలకు నిలయాలుగా మారాయి. చుట్టుపక్కల ఇళ్లలో పోగవుతున్న చెత్తాచెదారాన్ని వీటిలో పడేస్తున్నారు. వర్షా కాలం వచ్చేసరికి వాన నీళ్లు నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కోట్లాది లార్వా దోమలు పుట్టుకొస్తున్నాయి. కాలనీల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

కంటితుడుపు చర్యలు..నగరంలోని 66 డివిజన్లలో 3500 పైచిలుకు ప్రైవేటు ఖాళీ స్థలాలు(ప్లాట్లు) ఉన్నాయని బల్దియా ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాల లెక్కలు చెబుతున్నాయి. ఏటా వర్షాకాలంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు కాలనీల్లో తిరిగి ఖాళీ ప్లాట్ల వివరాలు సేకరిస్తున్నారు. యజమాని పేరు, ఎక్కడ ఉంటారు.., ఎన్నేళ్ల నుంచి స్థలం వృథాగా ఉంటుంది.. తదితర వివరాలు సేకరించారు. 550 మంది యజమానులకు నోటీసులు ఇచ్చారు. కేవలం 20–30 స్థలాలు శుభ్రం చేయించారు. తదుపరి చర్యలు తీసుకోవడం లేదు.

నిబంధనల ప్రకారం ప్రజారోగ్య భద్రత దృష్ట్యా ప్రైవేటు ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకునే అధికారం బల్దియా' కమిషనర్‌కు ఉంది. ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసుకోవాలని సంబంధిత యజమానికి నోటీసు జారీ చేయాలి. వారం, పది రోజుల్లో సమయం ఇవ్వాలి. స్పందించకపోతే యజమానికి రూ.25వేల వరకు జరిమానా విధించాలి. యజమాని ఇక్కడ లేకపోతే స్థలాన్ని నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకోవాలి.

ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాలు ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోకుండా అధికారులు ఉత్తిత్తి నోటీసులు ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. స్థలాలు శుభ్రం చేయడం లేదు. యజమానులపై జరిమానాలు విధించడం లేదు.

ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయంటే..వరంగల్ ప్రాంతంలో ఎన్టీఆర్ నగర్, సాయినగర్, గాయత్రి కాలనీ, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, బ్యాంకు కాలనీ, మర్రి వెంకటయ్య కాలనీ, ఆటోనగర్, దేశాయిపేట, కాశీబుగ్గ, పద్మ నగర్, ఎనుమాముల, మధురానగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేశ్ కాలనీ, లేబర్ కాలనీ, చింతల్, శివనగర్, విశ్వనాథ కాలనీ, గిర్మాజీపేట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఎస్ఆర్ఆర్ తోట, విద్యానగర్, ఏకశిలానగర్, జన్మభూమి జంక్షన్ రోడ్ ఖాళీ స్థలాలున్నాయి.

హనుమకొండ ప్రాంతంలో కాకతీయ కాలనీ, యాదవనగర్, రెడ్డికాలనీ, బాలసముద్రం, పద్మాక్షి కాలనీ, ఎస్బీహెచ్ కాలనీ, వడ్డేపల్లి, ప్రశాంత్ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటాద్రినగర్, సోమిడి, డీజిల్ కాలనీ, దర్గా, ప్రగతినగర్, ఎన్ఐటీ ఉద్యోగుల కాలనీ

ఇళ్ల మధ్య మురికి కూపాలు– హరి, గిర్మాజీపేట, వరంగల్

ఇళ్ల మధ్య ప్రైవేటు ఖాళీ స్థలాలు మురికి కూపాల్లా మారాయి. వానాకాలం వచ్చిందంటే చాలు వరదనీరు ఆగుతుంది. లక్షల కొద్దీ దోమలు పుట్టుకొస్తున్నాయి. సంబంధిత స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు కఠినంగా వ్యవహరించాలి. ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి.

దోమలతో ఇబ్బందులు– టి.మంజుల, కాశీబుగ్గ

దోమలతో అల్లాడుతున్నాం. తలుపు తీస్తే చాలు దోమలు ఈగల్లా వాలుతున్నాయి. కాశీబుగ్గ, పద్మనగర్‌లో ఇళ్ల చుట్టూ ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. చాలామంది చెత్తాచెదారం పడేస్తున్నారు. వాన పడగానే నీళు అన్నీ చేరుతున్నాయి. మూడు, నాలుగు నెలలు ఇబ్బందులు తప్పడం లేదు. నోటీసులు జారీ చేస్తాం..– డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

నగరంలోని 66 డివిజన్లలో గుర్తించిన ప్రైవేటు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. సమస్య తీవ్రంగా ఉన్న స్థలాలు చదును చేయించి, యజమానులకు జరిమానా విధిస్తాం. దోమల నివారణ చర్యలు మరింత ముమ్మరంగా సాగుతున్నాయి.

నీటి కుంటలు.. తుప్ప పొదలతో చిత్తడి

నర్సంపేటలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీటి నిల్వలు, తుమ్మలు, పిచ్చిమొక్కలు, పొదలు, తుప్పలతో నిండిఉన్నాయి. పట్టణ ప్రగతిలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయిస్తామని చెప్పి మాటలు కార్యరూపం దాల్చలేదు. పరిసరాల అపరిశుభ్రతతో దోమకాటుకు గురై మలేరియా, డెంగీ వంటి జబ్బులతో ఆసుపత్రుల పాలవుతున్నా, విషపురుగుల సంచారం పెరిగినా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. నివాసాల మధ్య.. పైచిత్రం నర్సంపేట పట్టణం 15వ వార్డు. తెలంగాణ కాలనీలో చుట్టూ పెద్ద భవనాలతో కూడిన నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలం. ఏటా వరద, నివాసాల వృథా నీటికి తోడు పిచ్చి మొక్కలు, రబ్బరు(కట్లాయి)చెట్లు విపరీతంగా పెరిగి ప్రస్తుతం నీటి కుంటను తలపిస్తోంది. ఏడాది పొడవునా దోమల బారినపడి అనారోగ్యం పాలవుతున్నట్లు పరిసర ఇళ్ల ప్రజలు తెలిపారు.

తాఖీదులు ఇచ్చాం–వీరస్వామి, టీపీవో నర్సంపేట

మొదటి పట్టణ ప్రగతిలో ఖాళీ స్థలాల సొంతదారులను గుర్తించి వాటిల్లో మట్టి పోసి ఎత్తు లేపాలని, తుమ్మలు, పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని 350–400 స్థలాల వారికి తాఖీదులు ఇచ్చాం.

# వ్యాపార విపణిలో సింగరేణి

వరంగల్ : బొగ్గు ఉత్పత్తిలో అపార అనుభవం ఉన్న సింగరేణి మార్కెట్ విస్తృతికి చర్యలు తీసుకుంటోంది. దానికి అనుగుణంగా ఇతర రంగాల్లోకి అడుగులు వేస్తోంది. 130 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణి ఇప్పటివరకు కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థగా పేరుంది. ప్రస్తుతం విద్యుత్తు రంగంలోనూ రాణిస్తోంది.. దీంతో పాటు మార్కెట్ పెంచుకోవడానికి బొగ్గు తవ్వకాల్లో సలహాలు ఇస్తోంది. ఇతర సంస్థలకు అన్వేషణ పనులు చేపట్టి ప్రాజెక్ట్ నివేదికలు సైతం తయారు చేస్తోంది. కొత్తగా జియోథర్మల్ : సింగరేణి సంస్థ కొత్తగా జియోథర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేపట్టనుంది. కొత్తగూడెం భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతంలోని పగిడేరు వద్ద భూమిలోంచి వస్తున్న వేడి నీటితో జియోథర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టింది. రూ.1.72 కోట్లతో 20 కిలోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు త్వరలో పనులు మొదలుపెట్టనుంది. ఇప్పటికే సౌరశక్తి విద్యుత్తును సింగరేణి వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కంపెనీ 300 మెగావాట్ల విద్యుత్తును అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో 81 మెగావాట్లకు సంబంధించిన పనులు పూర్తి కావస్తున్నాయి. దీంతో పాటు మరో 300 మెగావాట్ల సౌరశక్తి విద్యుదుత్పత్తికి నీటిపై తేలియాడే సౌర పలకాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసింది. అంతకంటే ముందు బొగ్గు ఆధారిత(థర్మల్ విద్యుత్తు) ఉత్పత్తి చేపడుతోంది. 1200 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు బొగ్గు ఆధారితంగా పనిచేస్తున్నాయి. అన్వేషణ పనులు : బొగ్గు అన్వేషణలోనూ సింగరేణికి ఎంతో అనుభవం ఉంది. డ్రిల్లింగ్ వేసి ఎంత లోతులో బొగ్గు ఉంది..? నాణ్యత.. బొగ్గును వెలికితీయవచ్చా..? లేదా అన్న విషయాలను అంచనా వేయడంలో సింగరేణికి ఎంతో అనుభవం ఉంది. దీన్ని కూడా వ్యాపారంగా మార్చుకున్న సింగరేణి ఇతర సంస్థలకు బొగ్గు అన్వేషణ పనులు చేసి పెడుతూ ఆదాయాన్ని గడిస్తోంది.

# అక్షర సేద్యం.. అభ్యున్నతికి నైవేద్యం

మిర్యాలగూడ : మనిషి సామాజిక, ఆర్థిక వృద్ధితో పాటు జ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి అక్షరాస్యత ఎంతో ముఖ్యం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధికంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల నేపథ్యంలో ప్రభుత్వాలు ఎన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా అనాదిగా అక్షరాస్యతలో వెనకబడే ఉంటున్నారు. అక్షరాస్యత పెంపునకు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమే నిరక్షరాస్యతకు ప్రధాన కారణం. ఈ కారణంగా పల్లెల్లో మూఢ నమ్మకాలు రాజ్యమేలడంతో పాటు అభివృద్ధి సైతం కుంటు పడుతోంది. నేడు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రభుత్వ కార్యక్రమాలు నిరుపయోగం

అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో 1988లో జాతీయ అక్షరాస్యత మిషన్ ఏర్పడింది. దీనితో పాటు తదనంతర కాలంలో వయోజన విద్య, రాత్రి బడులు, సాక్షర భారత్, ఇటీవల కాలంలో న్యూ ఇండియా లిటరసీ వంటి కార్యక్రమాలు ప్రారంభించారు. బడి ఈడు పిల్లలను తిరిగి బడికి పంపేందుకు ఆర్‌టీఈ చట్టం, 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య ఉన్నత విద్యకు దూర విద్యా విధానాన్ని సైతం ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే క్షేత్ర స్థాయిలో ఈ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడంతో ఏళ్ల తరబడి అక్షరాస్యతలో వెనుకబడే ఉన్నాం.

సాంకేతికంగా అనేక మార్పులు..

అక్షరాస్యత పెంపునకు సాంకేతికంగా పలు మార్పులు చోటు చేసుకున్నాయి. వీటితో కొన్ని లాభాలు, మరి కొన్ని నష్టాలు సైతం ఉన్నాయి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో చదువు ఆగిపోకుండా ఆన్‌లైన్ తరగతులు, ప్రభుత్వ టీవీ ఛానళ్ల ద్వారా తరగతుల నిర్వహణ, పలువురు నిపుణులు యూట్యూబ్ ద్వారా తరగతులు నిర్వహించారు. మరో వైపు అనేక యాప్‌లు స్థానిక భాషలో విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే నిరక్షరాస్యులు సైతం పరిజ్ఞానాన్ని పొందేందుకు వాయిస్ ద్వారా వెతికే పద్ధతి ఉండడం వల్ల అక్షరాస్యత పెంపునకు దోహద పడట్లేదనేది పలువురి వాదన.

1961లో 14.11 శాతం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1961 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యత శాతం 14.11 శాతం ఉంది. 50 ఏళ్ల అనంతరం 2001 లెక్కల ప్రకారం 57.15 శాతానికి పెరిగింది. అంటే 50 ఏళ్లలో 43 శాతం మాత్రమే పెరిగింది. ఇక 2011 లెక్కల ప్రకారం 64.20 శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో, మహిళల్లో కంటే పురుషుల్లోనే అధికంగా అక్షరాస్యులు ఉన్నారు.

అక్షరాస్యత పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు ఇవీ..

ప్రజలు ముఖ్యంగా బడి ఈడు పిల్లల్ని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలి. ఇందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత, గురుకుల పాఠశాలలతో పాటు కళాశాలలు అందుబాటులోకి తెచ్చింది. వీటిలో ఉచితంగా విద్యనందించవచ్చు. దీనికి తోడు మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు సమభావన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వం సైతం విద్యా సంస్థల్లో సరైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు మెరుగైన బోధన పద్ధతులు అవలంబిస్తూ..నిర్బంద విద్యను అమలు చేయాలి. వయోజన విద్యా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించేలా కళాకారులతో గ్రామాల్లో ప్రదర్శనలు ఇప్పించాలి. బాల కార్మిక వ్యవస్థలను సమూలంగా నిషేధించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

డాక్టర్ ఉప్పల పద్మ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, మిర్యాలగూడ.

విద్య లేని వాడు-వింత పశువు అంటారు. ప్రస్తుత ఆధునిక సమాజానికి ఈ నానుడి సరిగ్గా సరిపోతుంది. నిరక్షరాస్యత కారణంగా సమాజంలో అనేక మోసాలు జరుగుతున్నాయి. అక్షరాస్యతతో మనిషిలో ఆత్మవిశ్వాసంతో పాటు మంచి నడవడిక సైతం అలవడుతుంది. అక్షరాలు నేర్చిన వ్యక్తి సమాజ గతిని మార్చగలిగే శక్తిని సంపాదిస్తాడు. పట్టుదలతో జీవిత గమనాన్ని నిర్దేశించుకునే ఆలోచన ఏర్పడుతుంది. అంతటి ప్రాధాన్యమున్న అక్షర్యాసత పెంపునకు ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలయ్యేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

# తొలగని ఇసుక మేటలు

నల్గొండ : నల్గొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని ముప్పారం-వేపాడు గ్రామాల మధ్య గతేడాది సరిగ్గా ఏడాది కిత్రం నాగార్జునసాగర్ ఎడమ కాలువ కట్ట తెగింది. అండర్ టన్నల్(యూటీ) వద్ద గండిపడి కట్ట తెగి పూర్తిగా కొట్టుకుపోయింది. పచ్చటి పొలాలు ఒక్కసారిగా చెరువులను తలపించాయి. వంద ఎకరాల వరకు పంట నష్టం జరిగింది. 30 ఎకరాల వరకు ఇసుక మేటవేసింది. 20 ఎకరాల్లో ఎలాగోలా రైతులు తొలగించుకున్నారు. మరో పదెకరాల్లో ఎక్కువ ఇసుక మేటలు ఉండటంతో తొలగించుకునే శక్తి లేక రైతులు అలాగే వదిలేశారు. పంట నష్టానికి పరిహారం అందించకపోగా, కనీసం ఇసుకమేటలను సైతం ప్రభుత్వం తొలగించలేదని, దీంతో తాము ఇప్పటికీ పంటల నష్టపోతున్నామని బాధిత రైతులు వాపోతున్నారు.

ఎవరూ పట్టించుకోలేదు

బండారు అంజయ్య, బాధిత రైతు

గతేడాది కాలువతెగిన సమయంలో మా పొలాలు పూర్తిగా ధ్వంసమయాయి. నాది నాలుగు ఎకరాల పొలం పూర్తిగా దెబ్బతినడంతో



పాటు అడుగులోతు ఇసుక మేటలు వేశాయి. కనీసం ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు తొంగిచూడలేదు. గతేడాది రెండు కాలాలు పంట నష్టపోయి పెట్టుబడులు మీద పడ్డాయి. పొలాల్లో ఉన్న ఇసుక మేటలు తొలగించాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. అంత ఆర్థిక స్తోమత నాకు లేదు. అధికారులు స్పందించి ఇసుకమేటలను తొలగించాలి పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానుగోపినాథ్, డీఈఈ, ఎన్నెస్పీ నేను ఇటీవల బదిలీలో ఈ డివిజన్‌కు వచ్చాను. పొలాల్లో ఇసుక మేటలు వేసిన విషయం నా దృష్టికి రాలేదు. పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తాను.

# వణికిస్తున్న జ్వరాలు



జగిత్యాల : వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. మొన్నటి వరకు ఉక్కపోత వెంటనే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జ్వరాల తీవ్రత పెరిగింది. మూడు నెలలుగా జిల్లాలో డెంగీ జ్వరాల ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. గడిచిన పది రోజుల్లో అన్ని మండలాల్లోనూ డెంగీ కేసులు నమోదవుతుడటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. అత్యధికంగా సాధారణ జ్వరాలే అయినప్పటికీ డెంగీపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కలెక్టర్ యాస్మిన్‌బాషా, జిల్లా వైద్యాధికారి పి.శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఇందులో అధికంగా జ్వరాల కేసులు బయటపడుతున్నాయి. మరో వారంపాటు సర్వే కొనసాగుతోంది. వారం రోజులుగా జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఓపీతోపాటు జ్వరాలకు సంబంధించిన కేసులు రెట్టింపయ్యాయి. త్వరలో మరిన్ని కేసులు వెలుగుచూసే అవకాశం ఉంది.

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం..

జిల్లాలో డెంగీ ఇతర విషజ్వరాల నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రతే ప్రధానమని వైద్య అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. బావుల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంట్లోనూ దోమ తెరలు వాడాలని సూచిస్తున్నారు. మురుగుకాల్వలు శుభ్రం చేయాలని నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మురుగు ఉన్న పాంతాల్లో గంబూసియా చేపలు వదలాలని జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలు శుభ్రం చేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

విస్తరిస్తున్న డెంగీ..

జిల్లాలో క్రమంగా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరిశీలిస్తే.. కొడిమ్యాలలో 3, మల్లాపూర్ 1, గొల్లపల్లి 2, పెగడపల్లి 2, మల్యాల 3, రాయికల్ 6, మేడిపల్లి 8, సారంగపూర్ 1, వెల్గటూర్ 2, జగ్గాసాగర్ 3, అయిలాపూర్ 1, ఇబ్రహీంపట్నం 1, జగిత్యాల మోతెవాడ 1, జెఎస్‌రాంవెల్ 1 మొత్తం 35 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీరికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సనందిస్తున్నారు. కాలానుగుణ వ్యాధుల తీవ్రతపై గత నెలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వైద్య సిబ్బందికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు అన్ని ఆసుపత్రుల్లోనూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. మలేరియా, డెంగీ కేసుల కోసం ప్రత్యేక కిట్లు సిద్ధం చేశారు. జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించి రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రానికి పంపుతున్నారు.

బయటి ఆహారం తీసుకోవద్దు ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారిప్రజలు బయట దొరికే ఆహార పదార్థాలు తీసుకోకపోవడమే శ్రేయస్కరం. ఎలాంటి అనుమానాలున్నా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్తనమూనాలు ఇవ్వాలి. జ్వరం ఉన్నట్లయితే సొంత వైద్యం జోలికి వెళ్లొద్దు. వైద్యుడు లేదా ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకోవాలి. చేతులు ప్రతిసారీ శుభ్రం చేసుకోవాలి.

# ఏళ్ల కల.. సర్వేతో కదలిక



నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల ప్రజల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల వాసులు రైల్వే లైన్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. తాజాగా దక్షిణ మధ్య రైల్వే ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలను అనుసంధానిస్తూ ఒకేసారి రెండు లైన్లకు ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)కు ఆమోదం తెలిపింది. డోర్నకల్ - మిర్యాలగూడ మార్గం హుజూర్‌నగర్, కోదాడ పట్టణాలను అనుసంధానం చేస్తుండగా రాజధానిలోని ఉందానగర్ - జగ్గయ్యపేట మార్గం చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ వంటి పట్టణాల గుండా వెళ్లనుంది. ఈ మార్గం 228 కి.మీ. కాగా...నిర్మాణానికి రూ.4104 కోట్లు ఖర్చువుతుందని ద.మ.రైల్వే అంచనా వేస్తోంది. ఈ రెండు లైన్ల వల్ల ఉమ్మడి జిల్లాలోని సుమారు 60 శాతం ప్రజలు రైల్వే లైన్‌కు అనుసంధానమవుతారని రైల్వే వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బుల్లెట్ రైల్‌కు ప్రత్యామ్నాయంగా..తెలుగు రాష్ట్రాల్లో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారికి అనుసంధానంగా బుల్లెట్ రైల్ మార్గం నిర్మించాలని స్థానిక ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి పలుమార్లు రైల్వే మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రతిపాదనలు పంపినా రైల్వే శాఖ ఈ మార్గంలో రైల్వేలైన్ నిర్మాణానికి సుముఖత చూపలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ఉందానగర్ - జగ్గయ్యపేట మార్గం సర్వేకు ఆమోదం తెలపడం విశేషం. దీని ద్వారా జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చిట్యాల, నకిరేకల్, సూర్యాపేట, కోదాడతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభించినట్లయింది. సిమెంట్ కంపెనీలు ఎక్కువగా ఉన్న ప్రాంతం గుండా ఈ రైల్వే లైన్ నిర్మాణం కానుండటంతో ఆ శాఖకు సైతం ఆదాయం గణనీయంగా రానుంది. ఇప్పటికే ద.మ.రైల్వేలోని గుంటూరు డివిజన్‌లో అత్యధిక ఆదాయం ఉమ్మడి జిల్లాలోని సిమెంటు, బియ్యం పరిశ్రమల నుంచే వస్తోంది. రవాణా పరంగానూ ఈ మార్గం రైల్వే శాఖకు ఆదాయం తెచ్చిపెట్టనుంది. దీని వల్ల రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు కానుంది. సులువుగా యాదాద్రికి బొగ్గు రవాణాసింగరేణి ప్రాంతం నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రా (వైటీపీఎస్)నికి బొగ్గు రవాణా చేయడానికి డోర్నకల్ - మిర్యాలగూడ లైన్ ఉపయోగపడనుంది. ఇప్పటికే విష్ణుపురం (దామరచర్ల) నుంచి పాలకవీడు, మఠంపల్లి మీదుగా గూడ్స్ రైలు మార్గం నిర్మాణం పూర్తికాగా...ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను నడపాలని ఇక్కడి ప్రజలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. తాజాగా సర్వే ఆమోదం తెలిపిన మార్గం నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు వెసులుబాటు కలగనుంది. మరోవైపు విష్ణుపురం నుంచి వైటీపీఎస్ ప్లాంటు వరకు రైల్వే మార్గం నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఈ మార్గం ద్వారానే మిర్యాలగూడ ప్రాంతంలోని రైస్‌మిల్లుల ద్వారా ఉత్తరాదికి సరకును రవాణా చేసే సౌకర్యం కలగనుంది. ఈ రెండు మార్గాలు దేశ రాజధానితో పాటు హైదరాబాద్‌ను అనుసంధానించనున్నాయి. దీంతో ఉత్తర - దక్షిణ అనుసంధానత ద్వారా ఇక్కడి ఉత్పత్తులకు మరింత డిమాండ్ రానుంది. సాగర్ ఆయకట్టులో పండే సన్న ధాన్యం బియ్యం నాణ్యతగా ఉంటాయని దేశ వ్యాప్తంగా పేరుంది. ఈ మార్గాల నిర్మాణం ద్వారా ధాన్యం ఉత్పత్తుల ఎగుమతులు గతంలో కంటే మరింత పెరగనున్నాయి.

# సాగులో 'తారా'జువ్వ..!

ఆలేరు : మనిషై పుట్టినవారు కారాదు మట్టిబొమ్మ.. పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ.. అన్న పాట గుర్తుకొస్తుంది ఆ మహిళా రైతు పట్టుదల చూస్తే. అలుపనేది లేకుండా ఎప్పుడూ తన వ్యవసాయ పొలంలో ఏదో పని చేసుకుంటూనే ఉంటారు ఆవిడ. భర్త అర్ధాంతరంగా కాలం చేయడంతో మనోవేదన చెందారు. తిరిగి ఎలాగోలా సర్దుకుని ఉన్న ఇద్దరు పిల్లలను ప్రయోజకులను చేయాలనే సంకల్పంతో భర్తద్వారా సంక్రమించిన వ్యవసాయ భూమిని సాగుచేస్తూ ముందుకు సాగుతున్నారు. పొలం పనుల్లో చూపుతున్న చురుకుదనం కారణంగా ఏకంగా మూడు పర్యాయాలు ప్రభుత్వం ఉత్తమ మహిళా రైతుగా గుర్తించి సత్కరించడం విశేషం. ప్రస్తుతం పన్నెండు ఎకరాల్లో వరిని సాగు చేస్తూ ముంద్నుకు సాగుతున్నారు నారెడ్డి తారాదేవి.

మొండి ధైర్యంతో ముందుకు..

తారాదేవి స్వగ్రామం రాజపేట మండలం లక్ష్మక్కపల్లి. తల్లిగారింటి వద్ద చదువుకుంది అంతంతే.. చక్కగా సాగుతున్న సంసారంలో భర్త రాజిరెడ్డి రెండున్నర దశాబ్దాల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోవడం ఆ కుటుంబాన్ని కలచివేసింది. దుఃఖాన్ని దిగమింగుకుని ఉన్న కుమారుడు, కూతురును ఎలాంటి లోటు లేకుండా సాకాలని నిశ్చయించుకున్నారు. మొండి ధైర్యంతో భర్త ద్వారా సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేయ సంకల్పించారు. పడావుపడ్డ భూమిని చదును చేయించి ఏకంగా పన్నెండు ఎకరాల్లో పంటలసాగుకు పూనుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో పంటల దిగుబడికి ఒంటరి పోరాటం చేస్తూ మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. సాగు పరంగా ఇబ్బందులను సోదరుడు శేఖర్‌రెడ్డి, స్థానిక వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పరిష్కారం పొందారు. పంటల మార్పిడికి అప్పుడప్పుడూ పత్తి, మొక్కజొన్న, కూరగాయల సాగును చేపడుతున్నారు. అంతేగాక గతంలో పాడిపశువులను సాకుతూ పాలదిగుబడి పెంచడం గమనార్హం. స్థానికంగా గ్రామంలోని పాల సొసైటీలో 12 సంవత్సరాలు డైరెక్టర్‌గానూ, ఒక పర్యాయం ఛైర్మన్‌గానూ గతంలో బాధ్యతలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆదర్శరైతు విధులు చేపట్టడం విశేషం.

అందుకున్న పురస్కారాలు..

2011లో జిల్లా స్థాయిలో ఉత్తమ మహిళా రైతు పురస్కారం

2013 సంవత్సరంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని కంపాసాగర్‌లో ఉత్తమం రైతుగా ఎంపికై ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా సత్కారం.తాజాగా ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తొమ్మిదో ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ మహిళా రైతుగా అవార్డుతోపాటు రూ.10వేలు నగదు పురస్కారం.

వ్యవసాయం అంటే చాలా ఇష్టం..

నారెడ్డి తారాదేవి, లక్ష్మక్కపల్లిచిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనకు ఎంత కష్టమైనా వ్యవసాయం సాగులో ముందుకు తీసుకెళ్తుంది. ప్రస్తుతం పిల్లలిద్దరూ విదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్న సమయం మొత్తం పొలం పనులకే కేటాయిస్తున్నాను. సాంకేతిక, ఇతర సమస్యలకు వ్యవసాయాధికారులు సందేహాలు నివృత్తి చేస్తున్నారు. రానున్న రోజుల్లో పంటల దిగుబడిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలసాయం పొందాలనే తపనతో ఉన్నాను. సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలనే యోచనలో ఉన్నాను. ప్రభుత్వ పరంగా తనకు లభిస్తున్న గుర్తింపునకు మరింత ఉత్సాహంతో ముందుకెళ్తాను.

# కొనుగోళ్లకు సన్నాహాలు!

సూర్యాపేట: ధాన్యం కొనుగోళ్లలో గత యాసంగిలో జరిగిన ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కొనుగోళ్లకు అధికారులు సిద్ధమవుతున్నారు. పొరపాట్లు పునరావృతం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే నుంచే కార్యాచరణ మొదలు పెట్టింది. ఇటీవల అదనపు కలెక్టర్ నేతృత్వంలో పౌర సరఫరాల, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వరి సాగు, ధాన్యం వచ్చే అంచనా తదితర నివేదికలను తెప్పించుకుని అందుకు తగిన విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు నిర్ణయించారు. సామగ్రి, లారీలు, హమాలీలను సమకూర్చునేలా ప్రణాళిక రూపొందించారు. గన్నీ సంచుల కొరత లేకుండా ముందస్తుగా తెప్పించుకుని సన్నద్ధమవుతున్నారు.

అంచనాకు అనుకూలంగా ఏర్పాట్లు

జిల్లాలో 3,46,739 ఎకరాలలో వరి సాగు చేశారు. మొత్తం 9,61,046 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అక్టోబరులో ధాన్యం చేతికి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా 296 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. సహకార సంఘాల ద్వారా 113, ఐకేపీ ద్వారా 183 కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో మార్కెటింగ్, ఐకేపీ, పౌర సరఫరాల శాఖలకు



కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

సమస్యలు పునరావృతం కాకుండా..

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక వైపు పంట కోత సమయంలో అకాల వర్షాల కారణంగా నష్టపోవడమే కాకుండా ధాన్యం అమ్ముకునే సమయంలోనూ కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యాయి. ధాన్యం తడవడంతో మిల్లర్లు కోత పెడుతూ కొనుగోలు చేశారు. దీంతో అన్నదాతలపై మరింత భారం పడింది. లారీలు ఆలస్యం కావడంతో అన్నదాతలు నిరసన వ్యక్తం చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో ఈ సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రవాణా విషయంలో అధికారులు తగినన్ని వాహనాలు సమకూరాల్చి ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 లారీలు అవసరం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలను భిన్నంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తరుగు పేరిట దోపిడీ, ధాన్యం డబ్బులు జమ జాప్యాన్ని నివారించాల్సి ఉంది. వర్షాలు కురిసే ప్రమాదం ఉండటంతో కొనుగోళ్ల ఆరంభంలోనే టార్పాలిన్లు సరఫరా చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

# నైపుణ్య శిక్షణలతో ఇంతింతై..

కొత్తగూడెం : మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపాధి శిక్షణలు తోడ్పాటు అందిస్తాయి. సింగరేణి యాజమాన్యం కొంతకాలంగా ఈ దిశగా తనవంతు ప్రయత్నం చేస్తోంది. తన పరిధిలోని ప్రాంతాల్లో పలు నైపుణ్యాలు నేర్పిస్తోంది. కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు ఉపాధి పొందుతూ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఇంటి అవసరాల కోసమో, ఖాళీగా ఉన్నామనో.. ఆసక్తి ఉన్న అంశాల్లో నైపుణ్యాలు పెంపొందించుకున్నారు. ఇలాంటి వారికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి ఏరియాల్లోని 'సింగరేణి సేవా సమితి' ప్రస్తుతం వివిధ ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

సింగరేణి సేవా సమితి ఏటా పలు అంశాల్లో 1500 మంది మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కరోనా కారణంగా రెండు సంవత్సరాల పాటు శిబిరాలు నిర్వహించలేకపోయింది. గత సంవత్సరం నుంచి శిక్షణలను నిర్వహిస్తోంది. కరోనా సమయాన్ని మినహాయించి ఆరేళ్లలో ఆ సంస్థ వివిధ ఏరియాల్లో 12,558 మందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం విశేషం. ఇందుకోసం ఏటా రూ.కోటి నుంచి రూ.3 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. సింగరేణి కార్మిక కుటుంబాల మహిళలకే కాకుండా, సమీప ప్రాంతవాసుల వారికి కూడా నైపుణ్యాలు నేర్చుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ప్రస్తుతం వివిధ ఏరియాల్లో కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర అంశాల్లో మహిళలకు శిక్షణలు ప్రారంభించారు. ఆసక్తి ఉన్నవారిని ఆహ్వానిస్తున్నారు.

శిబిరాలు ప్రారంభం

కొత్తగూడెం ఏరియాలో ఉచిత వృత్తి శిక్షణ శిబిరం ప్రారంభమవుతోంది. 4 ఇంక్లైన్ వద్దనున్న సేవా సమితిలో ఫ్యాషన్ డిజైనింగ్, గౌతంపూర్ పాత సూపర్‌బజార్‌లో టైలరింగ్, మగ్గంవర్క్ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మిగతా ఏరియాల్లోనూ సేవా సమితి వారు కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో శిబిరంలో 25 నుంచి 30 మంది నైపుణ్యాలు నేర్చుకొనే వీలుంది. ఆసక్తిగల మహిళలు స్థానిక 'సేవా సమితి'ని సంప్రదించవచ్చు. పూర్తి వివరాలకు సేవా సమితి సమన్వయకర్త సాగర్ (ఫోన్.. 95021 90113)ను సంప్రదించాలి. త్వరలో కొత్తగూడెం రామవరంలోని సేవా కేంద్రంలోనూ కుట్టు, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

కుటుంబానికి అండగా నిలుస్తున్నా- ఆముదాల శ్రీలత, రుద్రంపూర్ సేవా సమితి ఉచిత శిక్షణలో భాగంగా 2021లో టైలరింగ్ నేర్చుకున్నా. సొంతంగా రుద్రంపూర్‌లో ఓ దుకాణాన్ని ఏర్పాటు చేసుకొన్నా. నేను నేర్చుకొన్న నైపుణ్యంతో మా కుటుంబానికి ఎంతో కొంత ఆదాయాన్ని సమకూరుస్తుండడం సంతోషాన్నిస్తోంది. మా మిత్రురాళ్లకు కూడా టైలరింగ్ నేర్పుతున్నా. మహిళలు ఖాళీగా ఉండకుండా ఏదో ఒక వ్యాపకం ఏర్పాటు చేసుకోవాలి.

ఆదరణ పెరుగుతోంది..- ఎం.దేవిక, గౌతంపూర్

అయిదేళ్ల క్రితం కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకొన్నా. గౌతంపూర్ ప్రాంతం వాసులు మెచ్చేలా, నచ్చిన ఆకృతుల్లో దుస్తులు కుట్టి ఇస్తున్నా. ఫ్యాషన్ డిజైనింగ్ కూడా నేర్చుకోవడంతో వినియోగదారుల సంఖ్య పెరిగింది. కుటుంబ ఆదాయానికి కొంత జోడించగలుగుతున్నానన్న సంతృప్తి ఉంది.అతివల ఆర్థిక స్వావలంబనకు కృషి-మధురవాణి, 'సేవా' అధ్యక్షురాలు, కొత్తగూడెం సింగరేణి వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది మహిళలు ఉచిత శిక్షణ పొంది ఆర్థికంగా నిలదొక్కుకొంటున్నారు. ఆర్థిక స్వావలంబనతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. మహిళా సాధికారత దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి. సంస్థ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. నేర్చుకున్న నైపుణ్యాలు జీవితంలో తప్పక ఉపయోగపడతాయి. ప్రస్తుతం ప్రారంభించిన శిక్షణలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు స్థానిక సమన్వయకర్తలను సంప్రదించాలి.

# పాడి పరిశ్రమకు ఊతం

కరీంనగర్ : జిల్లాలో దళితోద్ధరణ పథకం కింద పాడి పరిశ్రమాభివృద్ధికి మరింత ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే దళిత బంధు కింద హుజురాబాద్ నియోజకవర్గంలో వేలాది పాడి పశువుల పెంపకానికి ప్రోత్సాహం అందించారు. కొత్తగా మరో రెండు నియోజకవర్గాల్లోని 8 మండలాల పరిధిలో వెయ్యి మందికి రెండు వేల పాడి పశువులను అందించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. డ్రిస్టిక్ట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ సర్వీసెస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ (డీఎస్‌సీఎస్‌సీడీఎస్) అండర్ స్పెషల్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం (స్కాప్) కింద లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల విలువ చేసే రెండు పాడి గేదెలను అందజేస్తారు. పాడి పెంపకం ప్రోత్సాహంతో దళితుల అభ్యున్నతికి ఊతం ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఎవరు అర్హులు స్థానికులై, ఎస్సీ సామాజికవర్గానికి చెంది ఉండాలి. డైరీ యూనిట్ పొందాలనుకునే వారు యాభై ఏళ్ల లోపు వయసు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందని వారై ఉండాలి. 20 గుంటల స్థలం, పాడి పశువుల నివాసానికి కొట్టం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. పాడి పశువుల నుంచి పితికే పాలను



కరీంనగర్ డెయిరీకి విక్రయించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. సంవత్సర ఆదాయం రూ.1.5 లక్షలకు మించి ఉండకూడదు.

ఎంపిక కమిటీలబ్ధిదారుల ఎంపిక కమిటీలో స్థానిక ఎంపీడీవో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా సమీప బ్యాంకు మేనేజర్, డైరీ డెవలప్‌మెంట్ బోర్డు పక్షాన ఒకరు, వెటర్నటీ అసిస్టెంట్ సర్జన్, తహసీల్దార్ ఉంటారు. వీరందరూ గ్రామ సభలు ఏర్పాటు చేసి వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.రెండు లక్షల విలువ చేసేలా పాలు ఎక్కువగా ఇచ్చే గేదెను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ముందుగా.. మూడు నెలల తర్వాత మరో చూడి గేదెను అందిస్తారు. రూ.1.4 లక్షల రాయితీ లభిస్తుంది. మిగిలిన రూ.60 వేలకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఐదేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. త్వరలో జిల్లాలో అమలు– డాక్టర్ బండారి నరేందర్, జిల్లా పశు వైద్యాధికారిపైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక, పాడి గేదెల అందజేత ఉంటుంది. అందుకోసం సంబంధిత శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా పాలనాధికారి ఆర్‌వీ కర్ణన్ పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపికతో పాటు నాణ్యమైన పాడి పశువులను అందజేస్తాం. ఈ పథకం సంపూర్ణ అమలుతో జిల్లాలో మరింత పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

# ఆలయాల భద్రత ప్రశ్నార్థకం



కరీంనగర్ : నిఘా వైఫల్యమే అదనుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లను గుల్ల చేయడంతోపాటు ఆలయాల్లోనూ చోరీలకు పాల్పడుతున్నారు. ఏకంగా కొండగట్టు ఆలయంలోని గర్భగుడిలో చొరబడి అందినకాడికి దోచుకెళ్లిన సంఘటన ప్రజల్ని నివ్వెరపరిచింది. శుక్రవారం వేకువజామున కొండగట్టులో వెండి ఆభరణాలతో పాటు జగిత్యాల గ్రామీణ మండలం పొలేస్తేశ్వరస్వామి ఆలయంలోనూ హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన తీరు బెంబేలెత్తించింది. జగిత్యాల జిల్లాలో ఆలయాల్లోని హుండీలే లక్ష్యంగా వరుసగా చోరీలు జరుగుతున్న తీరుతో కలవరం మొదలైంది. భద్రత డొల్లతనాన్ని కళ్లకుగట్టేలా చూపిస్తున్న సంఘటనలు పోలీసుల పనితీరుకు సవాలుగా మారుతున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లోనూ అడపాదడపా దేవాలయాల్లో నగదు, సామగ్రి మాయమవుతున్నాయి.

రికవర్రీ ఉమ్మడి జిల్లాలో చోరీల సంఖ్య ఏటా పెరుగుతున్నా రికవరీ నామమాత్రంగా కనిపిస్తోంది. జరుగుతున్న దొంగతనాల్లో దాదాపు 20 శాతం దేవాలయాల్లోనే జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలతో పాటు ఇతర గుడులను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఏడాదిలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 ఆలయాల్లో చోరీలు జరిగాయి. 2022వ సంవత్సరంలో జగిత్యాల జిల్లాలో మాత్రం ఈ బెడద అధికంగా ఉంది. రాత్రివేళల్లో 60 చోరీలు జరిగాయి. కేసుల్లో రికవరీని 46.77 శాతం చేసినట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. సిరిసిల్ల జిల్లాలో పగటి వేళ 14, రాత్రి వేళ 55 చోరీలు జరిగి రూ.కోటికిపైగా సొమ్ము మాయమైంది. ఇందులో 40 శాతం మేర రికవరీ (రూ.45.89 లక్షలు) జరిగింది. పెద్దపల్లి జిల్లాలో 213 దొంగతనాలు చోటుచేసుకోగా రికవరీ శాతం 50 దాటలేదు. కరీంనగర్ జిల్లాలో 238 చోరీలు జరగ్గా.. మాయమైన సొత్తులో 46 శాతమే తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

నిద్రపోతున్న నిఘా

సీఎం కేసీఆర్ కొండగట్టులో పర్యటించిన పది రోజుల వ్యవధిలోనే భారీ చోరీ జరగడం గమనార్హం. పోలీసుల పహారాతో పాటు ప్రత్యేక సెక్యూరిటీ ఉన్న గుడి వద్దనే ఇలా దొంగతనం జరగడం బందోబస్తు తీరును వేలెత్తి చూపుతోంది. గుట్ట వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్‌లో రోజూ ఓ ఏఎస్సైతో పాటు 12 మంది హోంగార్డులు, ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమితులైన మరో 14 మంది సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తుంటారు. వీరి వేతనాల కింద దాదాపు రూ.60 లక్షలు వెచ్చిస్తున్నారు. పరిసరాల్లో ఏర్పాటు చేసిన 60కి పైగా సీసీ కెమెరాలను పర్యవేక్షించడానికి ఆలయం ముందు భాగంలోని దుకాణ భవన సముదాయంలో తెరను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మల్యాల ఠాణాతో పాటు హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోలు రూమ్‌కు అనుసంధానించినప్పటికీ చోరీ జరగడం గమనార్హం. ఔట్‌పోస్ట్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న గర్భాలయంలోకి ఆగంతకులు వెళ్లి.. పెద్ద ఎత్తున వెండి వస్తువులను తస్కరించినా.. ఉదయం వరకు అక్కడున్న భద్రతా సిబ్బంది పసిగట్టలేకపోయారు. రక్షణ సిబ్బంది రాత్రి వేళల్లో ఆలయ పరిసరాల్లో గస్తీ నిర్వహించకపోవడం, అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని భక్తులు భావిస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటితే రక్షణ సిబ్బంది నిఘా మరచి నిద్రలోకి జారుకుంటారని.. ఆలయ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండరన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అదనుగా భావించి పక్కా ప్రణాళిక ప్రకారం చోరీ చేసినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేములవాడ, ధర్మపురి క్షేత్రాల వద్ద కూడా గస్తీని పెంచాల్సిన అవసరముంది.

# ఎటు చూసినా వరి పొలాలే

జగిత్యాల : సమృద్ధి నీటివనరులతో ఉమ్మడి జిల్లాలో ఎటుచూసినా వరిపొలాలే దర్శనమిస్తున్నాయి. నవంబరు చివరి నుంచి ఈ నెల మొదటివారం వరకు రైతులు పెద్దఎత్తున వరినాట్లు వేయగా విస్తీర్ణం రీత్యా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాత రాష్ట్రంలోనే రెండవస్థానంలో నిలిచినట్లు వ్యవసాయశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వానాకాలంలో సాధారణం కన్నా 32 శాతం వరకు అధిక వర్షపాతం నమోదుకాగా భూగర్భ జలమట్టం కనిష్ఠస్థాయిలోనే ఉండటం, యాసంగి ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టు నీటిని విడుదల చేయటం, వరదకాలువలో నీరు నిల్వచేయటం తదితర కారణాలతో రైతులంతా వరిసాగుకే మళ్లారు. ఇతర పంటలకు కూలీల కొరత, వన్యప్రాణులు, కోతుల బెడద, ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య, కనీస మద్దతు ధర, ప్రభుత్వ సేకరణ లేకపోవటం తదితర కారణాలతో మెజారిటీ రైతులు వరివైపే మొగ్గారు. ఉమ్మడి జిల్లాలో నిరుడు యాసంగిలో 6.64 లక్షల ఎకరాల్లోనే రైతులు వరిపంటను పండించారు. ఈ యాసంగిలో 7 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపడతారని అధికారులు అంచనా వేసినా



9.33 లక్షల ఎకరాల్లో వరిని సాగుచేయటం వరిసాగు జోరును వెల్లడిస్తోంది.

విద్యుత్తు కోతలతో ఇబ్బంది..

ప్రస్తుత యాసంగిలో నువ్వుపంటను రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో జగిత్యాల జిల్లాలో సాగుచేయగా నాలుగు జిల్లాల్లోనూ మక్క, ఆవాలు, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, కంది, పెసర, మినుము, కూరగాయలు తదితర పంటలను విత్తుకున్నారు. వరిపంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయగా ఇటీవల విద్యుత్తు సమస్యతో రైతులు తల్లడిల్లుతున్నారు. అకస్మాత్తుగా ఎండవేడిమి పెరగటంతో భూగర్భ జలమట్టం తగ్గి నీటితడులు సమస్యగా మారగా చివరి ఆయకట్టుకు ఆశించినట్లుగా కాలువనీరు వెళ్లటంలేదు. మరోవైపు రాత్రి చలి, పగటిపూట ఎండవేడిమితో పోషకలోపాలు, చీడపీడల సమస్యకూడా పెరిగి వరి రైతులు పలుమార్లు సస్యరక్షణ చర్యలను చేపట్టాల్సివచ్చి తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు, సాగునీరు, చీడపీడల సమస్యను అధిగమించి ధాన్యాన్ని సగటుస్థాయిలో ఉత్పత్తి చేయటం రైతులకు సవాలుగా మారింది. త్రీఫేజ్ విద్యుత్తు, ఆయకట్టు ప్రాంతంలో సాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకుంటేనే పంటను సజావుగా పూర్తిచేయగలుగుతారు.

# ఇష్టారీతిన లే అవుట్లు.. కొనుగోలుదారుల పాట్లు



కరీంనగర్ : నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అనధికారిక, అక్రమలే అవుట్లపై అధికారుల నిఘా కరవైంది. పంచాయతీల పరిధిలో వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పల్లెప్రగతి కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు అక్రమ లేఅవుట్లను గుర్తించి నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు వచ్చినా పట్టించుకోలేదు. ఖాళీ స్థలాల కొనుగోలు విషయంపై అధికారులు హెచ్చరిస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఎక్కడెక్కడంటే.. పెద్దపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పాటు కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవసాయ భూములను వెంచర్లుగా మారుస్తున్నారు. బొంపల్లి, చందపల్లి(మినీహైడల్), నిట్టూరు, నిమ్మనపల్లి, అప్పన్నపేట, బంధంపల్లి, పెద్దపల్లి–మంథని పై వంతెన, రంగంపల్లి, నూతన కలెక్టరేట్, పెద్దకల్వల, పెద్దబొంకూరు ప్రాంతాల్లో సరిహద్దు గోడలు ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా రంగులు వేస్తున్నారు. అన్ని అనుమతులున్నాయని మభ్యపెడుతూ కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నారు. పెద్దపల్లి మండలంలో 6, పురపాలక సంఘం పరిధిలో కేవలం రెండు లేఅవుట్లు మాత్రమే అధికారికంగా గుర్తించామని పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారి అభినవ్‌కు తెలిపారు. అనుమతి లేనివి వస్తే రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌కు లేఖ రాశామని తెలిపారు. సుల్తానాబాద్‌లో గర్రెపల్లిలో మాత్రమే అధికారికంగా గుర్తించారు. దుబ్బపల్లి, నరసయ్యపల్లి, చిన్నకల్వల, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి, అరెపల్లి, పూసాల, యాదవనగర్, శాస్త్రీనగర్ ప్రాంతాల్లో సైతం వ్యవసాయ భూములను స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి యంత్రాలతో చదును చేసి ముగ్గులు పోసి విక్రయిస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలో ఏ ఒక్కట్టీ అధికారికంగా అనుమతులు పొందలేదు. మంథనిలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఇన్ఫ్రా డెవలపర్స్ పేరిట ఖాళీస్థలాలు కొనుగోలు చేసి అనుమతులు పొందకుండానే తమ భూమి కొంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రచారం చేస్తున్నారు. కమాన్‌పూర్, రామగిరి, సెంటినరీ కాలనీ, బుధవారం పేట, ముత్తారం, పుట్టపాక, సూరయ్యపల్లి ప్రాంతాల్లోనూ ఇలాంటివి వెలుస్తున్నాయి.

పెరిగిన ఆగడాలు పెద్దపల్లి, రంగంపల్లి వద్ద గతేడాది ఓ స్థిరాస్తి వ్యాపారితో పాటు కొందరు మధ్యవర్తుల మధ్య తగాదాలు జరిగాయి. దీంతో అతడు తుపాకీతో బెదిరింపులతో హల్‌చల్ చేయడంతో ప్రజలు నిర్ఘాంతపోయారు. వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తామని బోర్డులు ఏర్పాటు చేసినా సంబంధిత పురపాలక, పంచాయతీ అధికారులు పరిశీలించడం లేదు. తక్కువ ధరకే స్థలాలు సొంతం చేసుకోవచ్చంటూ చిరుద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు స్థిరాస్తి వ్యాపారులు మాయమాటలతో అంటగడుతున్నారు. కొన్న తర్వాత రిజిస్ట్రేషన్ అనుమతులు రాకపోగా, అభివృద్ధి పనులు జరగడం లేదు. పైగా ప్రభుత్వానికి అదనంగా చెల్లించాలంటూ వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు.

పట్టించుకోకుంటే తిప్పలే ఎకరం స్థలంలో లే అవుట్ ఏర్పాటు చేయాలంటే 40 అడుగుల రహదారి, 30 అడుగుల అంతర్గత రహదారి, 10 శాతం పురపాలక/పంచాయతీ పేరిట రిజర్వు స్థలం కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్ రుసుం, మార్పిడి, కాలువలు, వీధి దీపాలు, పైప్‌లైన్లు, రహదారుల అభివృద్ధికి దాదాపు రూ.60 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. యజమానులు సొంతంగా నిర్వహించాలంటే రూ.10 వేలు ధరావత్తు సొమ్ము చెల్లించాలి. అనుమతులు లేని లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటే బ్యాంకులు, ఇతర సంస్థలేవీ రుణాలు మంజూరు చేయవు.

వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన వ్యాపారులు రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసి భూమి మార్పిడి రుసుం(నాలా) 3 శాతం మేర చెల్లించి గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. వ్యాపారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

అనుమతులున్న చోటే కొనుగోలు చేయాలిడీటీసీపీవో సాంకేతిక అనుమతులున్న వెంచర్లలో మాత్రమే ఖాళీస్థలాలు కొనుగోలు చేయాలి. కేవలం పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రాంతాలు కలిపి 30.55 ఎకరాల్లోనే 8 లేఅవుట్లకు డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అనుమతులున్నాయి. అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారు. నిబంధనలు పాటించిన వారికే అన్నీ అనుమతులు, మౌలిక వసతులు కల్పిస్తాం. వీబీ శ్రీనివాస్‌రావు, జిల్లా డీటీసీపీవో

# పదిలో పట్టు సాధించేలా...

సిరిసిల్ల : కరోనాతో పదో తరగతి పరీక్షలు వరుసగా రెండేళ్లు రద్దయ్యాయి. అంతర్గత మూల్యాంకనం ఆధారంగా గ్రేడులు ఇచ్చారు. 2021–22 విద్యా సంవత్సరం మాత్రం 11 పేపర్లతో పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాల్లో జిల్లా 95.76 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం ఆరు పాఠ్యాంశాలను ఆరు పేపర్లగా నిర్ణయించారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురికావాల్సిన పరిస్థితి. 11 పేపర్లలో పాఠ్యాంశాన్ని విభజించి చదువుకునే వారు. ఒక పేపరులో తక్కువ మార్కులు వచ్చినా నిరాశ చెందకుండా.. పట్టుదలతో చదివి మరో దానిలో ఎక్కువ మార్కులు తెచ్చుకునే వీలుండేది. ఇలా మొత్తం గ్రేడ్‌లు సాధించేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం మొత్తం పాఠ్యాంశం ఒకే పేపరుగా ఉంటుంది. దీనిలో ప్రశ్నల విధానం ఎలా ఉంటుంది? ఏ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు నిడివితో రాయాలని నిత్యం విద్యార్థుల మదిలో ఆలోచనలు తొలుస్తున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం చూపుతూ అభ్యాస దీపికల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.




మొదటి విడత ప్రీ ఫైనల్ పరీక్షలు నుంచి జరుగుతున్నాయి. వీటి ఫలితాల ఆధారంగా పాఠ్యాంశాల వారీగా వెనకబడిన విద్యార్థులు మరింత పట్టుసాధించేలా ప్రణాళికను తయారు చేస్తున్నారు. దానిలో భాగంగానే విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం గణితం, సామాన్య, సాంఘిక, భౌతిక, జీవశాస్త్రాలకు ప్రత్యేకంగా అభ్యాస కరదీపికలను అందిస్తున్నారు. దీనికోసం జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 5,095 మంది విద్యార్థులకు వీటిని ఇవ్వనున్నారు. వీటిని లఘు, వ్యాసరూప, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలకు జవాబులతో రూపొందించారు. బుధవారం జిల్లా కేంద్రానికి చేరిన ఈ అభ్యాస కరదీపికలు మండల విద్యావనరుల కేంద్రాల ద్వారా శనివారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా భాషా పాఠ్యాంశాలకు సైతం అందజేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి

ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఆరు ప్రశ్నాపత్రాల విధానం తీసుకొచ్చింది. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ సిలబస్ బోధించే పాఠశాలల్లో అమలవుతోంది. దీంతో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుంది. అభ్యాసన దీపికలతో నూతన పరీక్ష విధానంపై విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళన తొలగుతుంది. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యాయుడు (భౌతిక, రసాయన శాస్త్రం)

ఆందోళన తగ్గుతుందిఅభ్యాసన దీపికలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాం. ఇప్పటి వరకు ప్రశ్నాపత్రం ఎలా ఉంటుందో అనే ఆందోళన ఉండేది. ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నాపత్రాలతో కొంత సులభమనిపిస్తుంది. పది జీపీఏ సాధించాలనే పట్టుదలతో ఉన్నాను. అన్నల్‌దాసు హన్సిక, సిరిసిల్ల

# లడ్డూ ప్రసాదంలో నాణ్యత ఎంత?

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు లడ్డూ ప్రసాదం అత్యంత పవిత్రంగా భావించి కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ఏదేని వేడుకల సందర్భంగా లక్షల్లో వస్తుంటారు. వీరు కొనుగోలు చేసి తీసుకెళ్లే లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపిస్తోందని, బరువులో వ్యత్యాసం వస్తుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు దిట్టం వినియోగించడం లేదనే ఆరోపణలున్నాయి.

వేములవాడలోని రాజన్న దర్శనానికి ప్రతి సోమ, శుక్ర, ఆది వారాల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే సుమారు 50 వేల లడ్డూలు, కోడె టికెట్‌ల లడ్డూలు 6 నుంచి 7 వేలు, అభిషేకం లడ్డూలు దాదాపు 400 వరకు విక్రయం అవుతుంటాయి. మిగతా రోజుల్లో 10 వేల నుంచి 20 వేల వరకు అమ్ముతుంటారు. నిబంధనల మేరకు ఒక్కో లడ్డూ 100 గ్రాముల బరువు ఉండాలి. దీని ధర రూ.20లు, అభిషేకం లడ్డూ 500 గ్రాములు ఉండాలి. దీని ధర రూ.100. అయితే బరువు తక్కువ ఉంటుందని



భక్తులు ఆరోపిస్తున్నారు. తయారు చేసిన తరవాత నాలుగైదు రోజులు ఉంటే తేమశాతం తగ్గి బరువు తక్కువగా ఉండే అవకాశాలున్నాయని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. చేతితో చేస్తుండటం వల్ల ఒకటి ఎక్కువ, మరొకటి తక్కువ బరువు ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

వీటి ద్వారానే ఎక్కువ ఆదాయం...

రాజన్న ఆలయానికి ఏటా దాదాపు రూ.125 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం ప్రసాదాలు, కోడె మొక్కులు ద్వారానే వస్తోంది. ఆలయంలో జరిగే ఉత్సవాల సందర్భంగా లక్షల్లో భక్తులు వస్తుంటారు. ఇందుకు అనుగుణంగా ఆలయ ప్రసాదాల విభాగం అధికారులు పెద్దఎత్తున లడ్డూ ప్రసాదం తయారు చేసి విక్రయిస్తుంటారు. ఇందుకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేసుకొని లక్షల్లో సిద్ధం చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారానే రూ. 55.25 లక్షల ఆదాయం సమకూరింది.

నిబంధనల ప్రకారం తయారీ– రాజశేఖర్, సూపరింటెండెంట్, ప్రసాదాల తయారీ విభాగం

లడ్డూల తయారీలో వినియోగించాల్సిన పదార్థాలను దిట్టం నిబంధనల మేరకు వాడటం జరుగుతుంది. నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తున్నాం. ప్రతీ లడ్డూ దాదాపు వంద గ్రాములు ఉండే విధంగా సిబ్బంది తయారు చేస్తారు.

# ఆధునికం.. సులభం.. దిగుబడి ఖాయం

జగిత్యాల : నేలపై కాకుండా సంచుల్లో సైతం సాగు చేయడమే లక్ష్యంగా మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగం సత్ఫలితాలు ఇవ్వడం విశేషం. ఈ దిశగా రైతులను నడిపించేందుకు అవగాహన కల్పించేందుకు ముందడుగు వేశారు. మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నారు. తీగజాతి కూరగాయలను పండిస్తూ నమూనా క్షేత్రంగా రూపొందించారు. నమూనా క్షేత్రంతునికి శివారులోని ఏర్పాటు చేసిన ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్ మిగతా వారి సహకారంతో ప్రయోగం చేపట్టారు. ప్లాస్టిక్, ఎరువుల కోసం వాడిన సంచుల్లో ఎర్రమట్టితో పాటు పశువుల పేడ వేసి నింపుతారు. తీగజాతి కూరగాయలు నేలపై కాకుండా పందిరి విధానంలో సాగు చేశారు. బిందు పరికరాలు బిగించి నీటి తడులు అందించారు. తీగజాతి కూరగాయలు కాకర, సొర, పొట్లకాయ, బీర పండించారు. ప్లాస్టిక్ బస్తాల్లో కూరగాయల విత్తనాలు మొలకెత్తిన తర్వాత వెదురు బొంగులు ఏర్పాటు చేసి వాటి మధ్యన జీఐ తీగలు కట్టడంతో తీగలు పైకి పాకాయి. వీటిని మూడు, నాలుగు సీజన్ల వరకు ఉపయోగించుకోవచ్చు.



# ఈ నెల 20న ఏపీ కేబినెట్ సమావేశం

విజయవాడ: ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ సమావేశంలో కీలక అంశాలపై మంత్రి మండలి నిర్ణయం తీసుకోనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించనుంది. కాగా, ఈ నెల 21 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు అయిదు రోజుల పాటు జరగనున్నట్లు ప్రాథమిక సమాచారం. అవసరాన్ని బట్టి మరో రెండు రోజులు పెంచే అవకాశముంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా కొన్ని ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది.




# చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఏపీ వ్యాప్తంగా తెదేపా రిలే దీక్షలు

**తెదేపా అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని.. ముమ్మాటికీ ఇది కక్ష సాధింపేనని ఆరోపించారు. పలుచోట్ల తెదేపా దీక్షలపై పోలీసులు ఆంక్షలు విధించారు.**

# ఒక్క రూపాయి అయినా పక్కదారి పట్టిందని నిరూపించారా?: పయ్యావుల



మంగళగిరి: ప్రశ్నించిన వారందరినీ అరెస్టు చేసుకుంటూ వెళ్తారా? అని ఏపీ ప్రభుత్వాన్ని తెదేపా సీనియర్ నేత, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో చంద్రబాబు అరెస్టు విషయమై మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించిన వారిని ఇలానే అరెస్టు చేసుకుంటూ పోతే రెండు సీట్లకే పరిమితమవుతారని హెచ్చరించారు. ప్రాథమిక ఆధారాలు లేకుండా కేసు నమోదు చేసి ఎలా అరెస్టు చేస్తారు అని ప్రశ్నించారు. "వైకాపా ప్రభుత్వం వచ్చాక 2021లోనే సీమెన్స్ అద్భుత పనితీరు ప్రదర్శించిందని సర్టిఫికెట్ ఇచ్చారు కదా? ఒప్పందం ప్రకారం సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అన్ని అందాయని ఒకవైపు చెబుతున్నారు కదా? నిధులు పక్కదారి పట్టాయంటున్నారు.. మరి ఇంతవరకు నిరూపించలేకపోయారు ఎందుకు? కేవలం అవినీతి మరకను చంద్రబాబుకు అంటించాలనేదే జగన్ కుట్ర. అక్రమ కేసులకు తెదేపా భయపడదు? రేపు రాజకీయ రణక్షేత్రంలో పదింతల శక్తితో ఎదుర్కొంటాం. ప్రభుత్వం, సీమెన్స్, డిజైన్‌టెక్ ఒప్పందం చేసుకున్నాయి. సీమెన్స్ కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదే? సీమెన్స్ సంస్థను ప్రతివాదిగా ఎందుకు చేర్చలేదు? ఒక్క రూపాయి అయినా పక్కదారి పట్టిందని నిరూపించగలిగారా? నాలుగేళ్లలో ఏ ఒక్కరోజైనా నోటీసు ఇవ్వలేదు. ప్రజా వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకే జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టులో సమాధానం చెప్పలేకపోతున్నారు. ఒప్పందం చేసుకున్న సీమెన్స్‌ను కోర్టు పరిధిలోకి ఎందుకు తీసుకురావట్లేదు? ఆరోపణ చేసి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. ఓటమి భయంతోనే తెదేపాపై దుష్ప్రచారం మొదలుపెట్టారు. నిజాలు వెలుగులోకి వస్తాయనే సీమెన్స్‌ను పక్కన పెడుతున్నారు" అని పయ్యావుల కేశవ్ ఆరోపించారు.

# 20 అడుగుల జైలు గోడలు చంద్రబాబుకు రక్షణ ఇస్తాయా..?

మచిలీపట్నం (కృష్ణాజిల్లా): టీడీపీ అధినేత చంద్రబాబుకు రాజమండ్రి సెంట్రల్ జైలులో ప్రాణ హాని ఉందని, 20 అడుగుల జైలు గోడలు ఆయనకు రక్షణ ఇస్తాయా..? అంటూ మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో మెంబర్ కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ జైళ్లలో హై సెక్యూరిటీ ఉంటే మొద్దు శ్రీను ఎలా చనిపోయాడని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఏ చిన్న హాని జరిగినా రాష్ట్రాన్ని స్థంభింప చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబుకు రాజమండ్రి సెంట్రల్ జైలే హైసెక్యూరిటీ అన్న ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అనంతపురం జైలులో ఉన్న మొద్దు శీను పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబుకు కేటాయించిన స్నేహ బ్లాక్‌పై కూడా రవీంద్ర కీలక వ్యాఖ్యలు చేశారు. స్నేహ బ్లాక్ పేరుకే వీఐపీ బ్లాక్ అని.. అదే స్నేహ బ్లాక్‌లో చేయని నేరానికి తాను కూడా రిమాండ్‌లో ఉండి వచ్చానన్నారు. స్నేహ బ్లాక్‌లో కనీస వసతులు ఉండవని, స్నానానికి వేడి నీళ్లు ఇవ్వరని, ట్యాప్ వాటరే తాగాల్సిన పరిస్థితులు అక్కడ ఉంటాయని కొల్లు రవీంధ్ర పేర్కొన్నారు.







# లోన్ చెల్లించిన 30రోజుల్లోగా పత్రాలివ్వాలి.. లేదంటే రోజుకు రూ.5 వేలు ఫైన్!

ముంబయి: బాధ్యతాయుత రుణ వితరణను ప్రోత్సహించే దిశగా 'భారతీయ రిజర్వ్ బ్యాంక్' కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, బ్యాంకింగేతర కంపెనీల వంటి నియంత్రిత సంస్థలు రుణ చెల్లింపులు పూర్తయిన 30 రోజుల్లోగా స్థిర, చరాస్తుల సంబంధించిన పత్రాలను రుణగ్రహీతలకు తిరిగిచ్చేయాలని ఆదేశించింది. ఈ విషయంలో 2003 నుంచే స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ.. కొన్ని సంస్థలు నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నాయని ఆర్‌బీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో బుధవారం మరోసారి ఈ విషయంపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి 2023 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. కొన్ని సంస్థలు నిబంధనలను ఉల్లంఘించడం వల్ల కస్టమర్ల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని ఆర్‌బీఐ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనివల్ల వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో రుణదాతల్లో బాధ్యతాయుత రుణ జారీలను ప్రోత్సహించడం కోసమే ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వివరించింది. తాజా ఆదేశాల ప్రకారం.. రుణ గ్రహీతలు తమ స్థిర లేదా చరాస్తులకు సంబంధించిన పత్రాలను రుణం పూర్తిగా చెల్లించిన వెంటనే సంబంధిత బ్యాంకు/సంస్థలు లేదా వాటికి సంబంధించిన కార్యాలయాల నుంచి తీసుకోవాలి. ఒకవేళ రుణగ్రహీతల అకాల మరణం సంభవిస్తే పాటించాల్సిన నియమ నిబంధనలను కూడా సంస్థలు పక్కాగా రూపొందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ విధానాలన్నింటినీ.. సంస్థలు తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని తెలిపింది. ఒకవేళ రుణం పూర్తిగా తిరిగి చెల్లించిన 30 రోజుల్లోగా పత్రాలను ఇవ్వలేకపోతే.. అందుకుగల కారణాలను తెలియజేస్తూ బ్యాంకులు కస్టమర్లకు సమాచారం అందజేయాలి. సరైన కారణాలు లేకుండా బ్యాంకులు/సంస్థల నిర్లక్ష్యం వల్లే జాప్యం జరిగితే.. రుణ గ్రహీతలకు రోజుకు రూ.5,000 చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. ఒకవేళ పత్రాలు కనపడకుండా పోతే.. వాటిని తిరిగి పొందేలా రుణగ్రహీతలకు సాయం చేయాలి. అలాగే అందుకు అయ్యే ఖర్చును మొత్తం బ్యాంకులు/సంస్థలే భరించాలి. దీనితో పాటు రోజుకు రూ.5,000 పరిహారం కూడా అందజేయాలి.




# సైనికుడిని కాపాడేందుకు.. ప్రాణత్యాగం చేసిన శునకం

దిల్లీ : ఉగ్రవాదుల దాడిలో సైనికుడిని రక్షించే సమయంలో ఇండియన్ ఆర్మీకి చెందిన కెంట్ అనే ఆరేళ్ల శునకం ప్రాణాలు కోల్పోయింది. మంగళవారం జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్న బృందం.. కెంట్‌ను తీసుకువెళ్లింది. ఈ క్రమంలో ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. 'ఆపరేషన్ సుజలిగాల'లో భాగంగా ఒక దట్టమైన పొద దగ్గర సైనికుల బృందం కెంట్‌ను అనుసరిస్తోంది. ఈ క్రమంలో ఉగ్రవాదులను పసిగట్టిన శునకం సైన్యాన్ని అప్రమత్తం చేసింది. అయితే.. ఇరువర్గాల మధ్య భారీగా కాల్పుల జరిగాయి. ఈ నేపథ్యంలో ఓ సైనికుడిని ఉగ్రవాదులు చుట్టుముట్టడంతో కెంట్ వారికి ఎదురుగా వెళ్లింది. భారీ కాల్పుల మధ్య ఆ శునకం తీవ్రంగా గాయపడి మరణించింది. కెంట్ త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ భారత సైన్యం ఎక్స్(ట్విటర్)లో నివాళుల అర్పిస్తూ.. 'ఇది ఎంతో విచారకరమైన వార్త.. 21వ ఆర్మీ డాగ్ యూనిట్‌లోని లాబ్రడార్ జాతికి చెందిన ఆడ శునకం (కెంట్) తన సైనికుడి ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణాలను కోల్పోయింది. దేశం కోసం చేసిన గొప్ప త్యాగం ఇది' అని పేర్కొంది. ఇక ఈ ఎదురుకాల్పుల్లో ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టగా.. ఓ ఆర్మీ జవాను ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లకు, ఓ ప్రత్యేక పోలీసు అధికారికి గాయాలు అయ్యాయని జమ్మూ జోన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ముఖేశ్ సింగ్ తెలిపారు.



# జీ20 సెక్రటేరియట్‌లో ప్రధాని ఆకస్మిక పర్యటన

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సుష్మా స్వరాజ్ భవన్‌లోని జీ20 సెక్రటేరియట్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ఆయనతో పాటు విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ కూడా పాల్గొన్నారు. భారత్ నేతృత్వంలో జీ20 సదస్సు విజయవంతంగా ముగిసింది. అందుకు జీ20 సెక్రటేరియట్‌లో ఉన్న విదేశాంగ మంత్రిత్వ శాఖలోని అధికారుల కృషి ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ సెక్రటేరియట్‌ను సందర్శించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులను పలకరించారు. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు శ్రమించిన అధికారులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా జీ20 సదస్సుకు సంబంధించి తమ అనుభవాలను కూడా పంచుకున్నారు. అంతేకాకుండా అన్ని స్థాయిల్లోని సిబ్బందితో మోదీ సంభాషించారు. ఇదిలా ఉండగా.. జీ20 సదస్సును విజయవంతం చేసేందుకు విదేశీ మంత్రిత్వ శాఖ నుంచి 114 మంది అధికారులను ఈ సెక్రటేరియట్‌లో నియమించారు. ఆగస్టులో అదనంగా మరో 140 మంది యువ అధికారులను ఇందులో చేర్చారు. ఈ బృందానికి షెర్పా అమితాబ్ కాంత్, ప్రధాన సమన్వయకర్త హర్ష్ ష్రింగ్లా మార్గదర్శకత్వం వహించారు. దాదాపు 200 గంటల పాటు నిరంతర చర్చలు.. 300 ద్వైపాక్షిక సమావేశాలను దౌత్యవేత్తల బృందం నిర్వహించింది. దీని ఫలితంగా జీ20 శిఖరాగ్ర సదస్సులో నేతల మధ్య దిల్లీ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం సాధ్యమైంది. అదనపు కార్యదర్శులైన ఈనం గంభీర్, కె.నాగరాజు నాయుడుతో కూడిన దౌత్యవేత్తల బృందం ఈ ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించినట్లు షెర్పా అమితాబ్ కాంత్ వెల్లడించిన విషయం తెలిసిందే.



# 'స్కిల్' కేసులో ఆధారాలున్నాయా?

# అర్ణబ్ ప్రశ్నకు నీళ్లు నమిలిన ఎమ్మెల్యే

అమరావతి: నైపుణ్య శిక్షణ కేంద్రాలకు సంబంధించిన కేసులో తెదేపా అధినేత చంద్రబాబుకు సీమెన్స్ సంస్థ లంచం ఇచ్చినట్లు మీ దగ్గర ఆధారాలున్నాయా? అని రిపబ్లికన్ టీవీ ఎడిటర్-ఇన్-చీఫ్ అర్ణబ్ గోస్వామి వేసిన ప్రశ్నకు... సూటిగా సమాధానం చెప్పలేక నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి నీళ్లు నమిలారు. తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం తదితరులు పాల్గొన్న ఆ చర్చా కార్యక్రమంలో వైకాపా ఎమ్మెల్యేను... 'రాష్ట్ర ప్రభుత్వం రూ.371 కోట్లు ఖర్చు చేసిందని, 90 శాతం నిధులు వెచ్చించాల్సిన సీమెన్స్ ఒక్క రూపాయి కూడా పెట్టలేదని మీరంటున్నారు. ఈ కేసులో ఆర్థికపరమైన లావాదేవీలు జరిగినట్టుగా మీ దగ్గర ఆధారాలేమున్నాయి? సీమెన్స్ నుంచి చంద్రబాబు ఒక్క రూపాయి తీసుకున్నట్టు కూడా రిమాండ్ కాపీలో ఎక్కడా లేదు. ఒకవేళ చంద్రబాబుకు సీమెన్స్ లంచం ఇచ్చిందన్నది మీ ఆరోపణ అయితే... మీ దగ్గర ఆధారం ఉందా?' అని అర్ణబ్ ప్రశ్నించారు. దానికి సూటిగా సమాధానం చెప్పలేని ఎమ్మెల్యే... 'అదే సీఐడీ చూస్తోంది. దాన్నే నిరూపించాలనుకుంటోంది. దాని కోసమే విచారణ సాగుతోంది. చంద్రబాబు సహకరించడం లేదు' అని బదులిచ్చారు.

నైపుణ్య కేంద్రాల వ్యవహారం చంద్రబాబు హయాంలోనే జరిగిందని దాన్ని కేబినెట్ ఎజెండాలో లేకుండా చివరి నిమిషంలో పెట్టి, ఆమోదించారని, అంత హడావుడిగా చేయాల్సిన అవసరమేమిటని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. దానిపై అర్ణబ్ స్పందిస్తూ... 'హడావుడి నిర్ణయం అంటే మీ వైకాపా సభ్యులకూ ప్రమేయం ఉందని ఆరోపణలున్న మద్యం కుంభకోణంలో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయం

# సీఐడీ కస్టడీ పిటిషన్‌పై 18 వరకు విచారణ చేపట్టొద్దు: హైకోర్టు ఆదేశం




అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. విచారణను ఈనెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సీఐడీ సమయం కోరగా.. హైకోర్టు అంగీకరించింది. మరోవైపు సీఐడీ వేసిన కస్టడీ పిటిషన్‌పై ఈనెల 18 వరకు విచారణ చేపట్టవద్దని ఏసీబీ కోర్టును ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చంద్రబాబును 5 రోజుల కస్టడీ కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీఐడీ పిటిషన్‌పై ఎలాంటి విచారణ చేపట్టొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈనెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

# ఏపీ పరిణామాలు ఢిల్లీ పెద్దలకు కనబడట్లేదా..?



అమరావతి: ఏపీ పరిణామాలు ఢిల్లీ పెద్దలకు కనబడట్లేదా..? అని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.." చంద్రబాబు అక్రమ అరెస్టులో ఢిల్లీ పెద్దల పాత్ర ఉన్నందుకే మాట్లాడట్లేదా?.కేంద్ర పెద్దల మౌనం దేనికి సంకేతం.కేంద్ర పెద్దల ఆశీర్వాదం లేకుండా చంద్రబాబుని అరెస్టు చేయించే ధైర్యం జగన్‌రెడ్డి చేయగలడా ?.కేంద్రం ఇచ్చే నిధులను తినేస్తున్న జగన్ చర్యలు మీకు కనిపించట్లేదా?.రాష్ట్రంలో వ్యవస్థలన్నీ దిగజారి పనిచేస్తున్నాయి.పదిమందికి ఉపయోగపడే అఖిలభారత సర్వీస్ అధికారులు ఇందులో భాగస్వామ్యం కావటం దురదృష్టకరం.40ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యం ఎప్పుడూ చూడలేదు. రావణాసురుడు రాజ్యంలో రామపాలన ఎలా సాధ్యం. ఇడుపులపాయ సమీపంలో ఉన్న స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ నుంచి కూడా ఎందరో శిక్షణ పొందారు.స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆమోదానికి మొత్తం మంత్రివర్గ బాధ్యత.ఇందులో ప్రధాన పాత్రదారులు అజయ్ కల్లెం, ప్రేమ చంద్రారెడ్డిలను అరెస్టు చేయకుండా వదిలేయడం ఎంతవరకు సబబు.అఖిలపక్ష నేతలంతా కలిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు అన్నీ పరిశీలించి తప్పేముందో తేల్చలి" అని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

# స్వయంభు.. ఎవరీ సుందరి.. ఎంతందమైన శిల్పం?

టాలెంటెడ్ హీరో నిఖిల్ ఇటీవలే తన కెరీర్ ల్యాండ్‌మార్క్ (20వ) సినిమా 'స్వయంభు' కోసం మార్షల్ ఆర్ట్స్ లో కఠోర శిక్షణ కోసం వియత్నాం వెళ్లాడు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకుడు కాగా, ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై పాన్ ఇండియా ప్రాజెక్టును భువన్ - శ్రీకర్ నిర్మించనున్నారు. నిఖిల్ లెజెండరీ యోధుడి పాత్రలో నటించేందుకు ఆయుధ పోరాటం, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నాడు. నమ్మశక్యం కాని వార్ సీక్వెన్సులతో అలరించే ఈ సినిమాలో అతడు కొన్ని అసాధారణ స్టంట్స్ లో కనిపించనున్నాడు. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం.. ప్రతిభతో మెరిసిపోయే అందం, బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్న సంయుక్త మీనన్ ఇందులో కథానాయికగా నటిస్తోందని తెలిసింది. ఈరోజు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఆకర్షణీయమైన పోస్టర్‌ను




మేకర్స్ విడుదల చేశారు. ఒక పెద్ద కోట ముందు, భారీ ఆభరణాలతో కూడిన యువరాణి శిల్పంలా సంయుక్త రూపం ఆకట్టుకుంటోంది. అక్కడ ఉన్న అందమైన శిల్పం సంయుక్త చేతిపై ఒక పక్షి వాలి ఉంది. అది తన ప్రియుడి నుంచి ఎలాంటి కబురందించాలని సినిమాలోనే చూడాలి. స్వయంభూ టాలీవుడ్ లో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న భారీ చిత్రం. రవి బస్రూర్ సంగీతం అందించనుండగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగారి డైలాగ్స్ అందించారు. ఫిజికల్ మేకోవర్‌లో ఉన్న నిఖిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లెజెండరీ యోధుడిగా అద్భుతంగా కనిపించాడు. కార్తికేయ 2 తో బ్లాక్ బస్టర్ అందుకున్న నిఖిల్ మంచి జోష్ తో వరుస సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

# మెల్లి మెల్లిగా మహానటి బాలీవుడ్‌కి జంప్!

మహానటి కీర్తి సురేష్ మెల్లి మెల్లిగా బాలీవుడ్ కి జంప్ అవుతోందా? అంటే అవుననే గుసగుసలు వినిపిస్తున్నాయి. సమంత .. నయనతార లాంటి స్టార్ హీరోయిన్లకు ఇటీవల బాలీవుడ్ లో అవకాశాలు పెరిగాయి. ఫ్యామిలీమ్యాన్ ఫ్రాంఛైజీతో నిరూపించి, సిటాడెల్ సిరీస్ తో సమంత హిందీ పరిశ్రమలో మరోసారి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. అలాగే జవాన్ తో నయన్ ఆశించినది సాధించింది. ఆ ఇద్దరికీ ఆఫర్ల వెల్లువ అమాంతం పెరిగిందని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇంతకుముందు రాశీఖన్నా సైతం రాజ్ అండ్ డీకే ఫర్జీతో బాలీవుడ్ లో హాట్ టాపిక్ అయింది. పుష్ప తర్వాత రష్మిక మందన్న అద్భుత అవకాశాలు అందుకుంటోంది. ఇప్పుడు అదే కేటగిరీలో మరో సౌత్ నటి చేరబోతోందంటూ ప్రచారం సాగుతోంది. అందాల కీర్తి సురేష్ కూడా హిందీ చిత్రసీమలో రాణించి



పాన్ ఇండియా స్టార్ గా వెలగాలని కలలు గంటోంది. కీర్తి ఇప్పటికే బాలీవుడ్ లో నటించాలని కలలు కంది. కానీ ఆ కల ఇన్నాళ్లు నెరవేరలేదు. ఇప్పటికి నెరవేరబోతోంది. ఇటీవలే కీర్తిని బాలీవుడ్ లో క్రేజీ ఆఫర్ వరించింది. యువహీరో వరుణ్ ధావన్ సరసన ఈ భామకు అవకాశం దక్కింది. జవాన్ తో బంపర్ హిట్ కొట్టిన అట్లీ ఈ చిత్రానికి దర్శకుడు కావడం ప్రధాన అస్సెట్ కానుంది. నిజానికి అట్లీ నయనతారకు అద్భుతమైన అవకాశాన్నిచ్చారు. జవాన్ తో నయన్ పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకుంది. తర్వాత కీర్తి సురేష్‌కి అట్లీ ఆఫర్ ఇవ్వడం అంటే రొట్టె విరిగి నెయ్యిలో పడిన చందమేనని కూడా అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. కీర్తికి నిజానికి సౌత్ లో ఆశించినంతగా పెద్ద ఆఫర్లు లేవు.. కానీ ఇప్పుడు బాలీవుడ్ కి వెళ తోంది. అక్కడ ఆశించిన బిగ్ హిట్ సాధిస్తే ఒక యామీ గౌతమ్ లా ఆఫర్లు అందుకుంటుందనే అంతా భావిస్తున్నారు.

ఫ్యామిలీమేన్ ఫ్రాంఛైజీతో సమంత ఎదురేలేని నటిగా హిందీ ప్రేక్షకుల్లో అభిమానం చూరగొంది. జవాన్ లో యాక్షన్ క్వీన్‌గా మెరిపించిన నయనతారకు ఇప్పుడు హిందీ బెల్ట్ లో ఫాలోయింగ్ ఏర్పడింది. అదే తీరుగా ఇప్పుడు కీర్తి కూడా నిరూపించాలని భావిస్తోంది. సిటాడెల్ లో వరుణ్ ధావన్ - సమంత రూత్ ప్రభుల జోడీ హిందీ పరిశ్రమలో విపరీతమైన ఉత్సాహాన్ని సృష్టించింది. సమంత సౌత్ ఇండియన్ గ్రేస్ .. వరుణ్ ధావన్ బాలీవుడ్ ఆకర్షణతో సిటాడెల్ సినిమాటిక్ బ్యూటీగా మారుతుందని భావిస్తున్నారు.




# స్టార్ల క్యూట్ కిడ్స్ ఎదిగేస్తున్నారుగా..!



దక్షిణాది టాప్ స్టార్లు సినిమాల్లో తమ అసాధారణమైన నటనతో హృదయాలను గెలుచుకుంటున్నారు. సదరు స్టార్లు మాత్రమే కాదు, వారి పిల్లలు కూడా తక్కువ సమయంలోనే లైమ్‌లైట్ లోకి వస్తూ అపారమైన కీర్తిని పొందుతున్నారు. స్టార్ కిడ్స్ వారి క్యూట్ లుక్స్ .. తెలివితేటలు, మనోహరమైన వ్యక్తిత్వాలతో అభిమానులను విస్మయానికి గురిచేస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సూపర్ స్టార్ మహేష్, రాకింగ్ స్టార్ యష్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, తమిళ స్టార్ సూర్య సహా పలువురి వారసులు నిరంతరం ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నారు. టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేష్ బాబు - నమ్రత శిరోద్కర్ జంటకు ముచ్చటగా ఇద్దరు పిల్లలు. కుమార్తె సితార ఘట్టమనేని .. కుమారుడు గౌతమ్ ఘట్టమనేని ఇప్పటికే అంతర్జాలంలో పాపులర్ కిడ్స్. మహేష్ -నమ్రత వీలున్న ప్రతి వేదికపైనా తమ పిల్లల ఫోటోలను షేర్ చేస్తున్నారు. ఇన్ స్టా, ట్విట్టర్ సహా ఇతర సోషల్ మీడియాల్లో సదరు స్టార్ కిడ్స్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. చాలా ఫోటోషూట్లలో క్యూట్‌నెస్ ఓవర్ లోడెడ్ అని అభిమానులు ప్రేమను కురిపిస్తున్నారు. ఇక వీలున్న ప్రతిసారీ తన పిల్లలు భార్యతో కలిసి మహేష్ వెకేషన్స్ కి వెళుతుంటారు. స్పాట్ నుంచి నమ్రత తమ పిల్లల ఫోటోలను షేర్ చేస్తుంటారు. వీటిలో సితార, గౌతమ్ ల క్యూట్ నెస్ చాలాసార్లు ఎంతో ఆకర్షించాయి. నవరసనటసార్వభౌముడు, అన్నగారు ఎన్టీఆర్ కి సిసలైన వారసుడిగా జూ.ఎన్టీఆర్ పేరు మార్మోగుతోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ కి ఇద్దరు కుమారులు. నందమూరి అభయ్ రామ్ - నందమూరి భార్గవ్ రామ్.. ఆ ఇద్దరూ కూడా ఎన్టీఆర్ లెగసీని ముందుకు నడిపిస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అభయ్, భార్గవ్ చూస్తుండగానే వేగంగా ఎదిగేస్తున్నారు. ఎన్టీఆర్ తరచుగా తన భార్య పిల్లలతో పర్యటనల నుండి ఫోటోలను షేర్ చేస్తుంటారు. ఈ ఫోటోలు ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అవుతుంటాయి. ఎన్టీఆర్ వారసులు భవిష్యత్ పరిశ్రమను ఏలే టాప్ స్టార్లు అవుతారని ఇప్పటికే అభిమానులు అంచనా వేస్తున్నారు. అల్లు అర్జున్ పుష్ప2తో మరోసారి అభిమానులను ఉత్తేజపరిచేందుకు సిద్ధంగా ఉన్నాడు. బన్ని తరచుగా వెకేషన్ హాలిడేస్ ని ఎంజాయ్ చేసేందుకు ఇష్టపడతాడు. పిల్లలు అల్లు అయాన్ .. అల్లు అర్హా భార్య స్నేహాతో కలిసి నిరంతర విహార యాత్రలకు ప్లాన్ చేస్తుంటాడు. ఇక వెకేషన్ నుంచి ప్రతి అందమైన ఫోటోని బన్ని షేర్ చేస్తుంటారు. అవి అభిమానుల్లో జోరుగా వైరల్ అవుతుంటాయి. అల్లు అర్జున్ తన వారసులను నటరంగంలో తీర్చిదిద్దేందుకు ఇప్పటి నుంచే పెద్ద ప్రణాళికతో ఉన్నారు. ఇప్పటికే అల్లు అర్హా నటిగా ఆరంగేట్రం చేసింది. క్యూట్ లుక్స్ తో అల్లరి చేయడంలో అర్హాను మించిన వారే లేరు. ఇక అయాన్ ఎంతో రిజర్వ్ డ్ గా ఉంటాడు. ఈ క్యూట్ కిడ్స్ ఫోటోలకు వెబ్ లో గొప్ప స్పందనలు వ్యక్తమవుతుంటాయి. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వారసుల్లో అకీరా నందన్, ఆద్య ఇరువురు సోషల్ మీడియాల్లో అభిమానులకు టచ్ లో ఉన్నారు. అకీరా తొందర్లోనే నటనలోకి ఎంట్రీ ఇస్తాడని ప్రచారమవుతోంది. ప్రస్తుతం అతడు విదేశాల్లో నటశిక్షణ పొందుతున్నాడు. అకీరా నందన్ పవన రెండో భార్య రేణు దేశాయ్ గారాల పుత్రుడు అన్న సంగతి తెలిసిందే. అకీరా, ఆద్య ఇప్పుడు క్యూట్ కిడ్స్ కాదు. టీనేజీ లో ప్రవేశించారు. వారి ఫోటోలు ఇప్పటికే అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. KGF స్టార్ యష్ కూతురు ఐరా .. కొడుకు యథార్వ్ నిరంతరం సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమవుతున్నారు. యష్ తన తీవ్రమైన షెడ్యూళ్లను ముగించి, తన కుటుంబం చిన్న పిల్లలతో గడపడానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తాడు. అందుకు సంబంధించిన ఫోటోలను యష్ నిరంతరం షేర్ చేస్తుంటే అవి అభిమానుల్లో వైరల్ గా మారుతున్నాయి. తమిళ టాప్ హీరో సూర్య 2006లో సహనటి జ్యోతికను వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె దియా, కుమారుడు దేవ్ ఉన్నారు. సూర్య నిరంతరం తమ పిల్లలతో విహారయాత్రలను ఆస్వాధిస్తారు. సామాజిక సేవా కార్యకలాపాలతోను సూర్య- జ్యోతిక ఇప్పటికే ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు. నయనతారకు సరోగసీలో కవల మగ పిల్లలు జన్మించిన సంగతి తెలిసిందే. ఉయిర్ రుద్రోనీల్ ఎన్ శివన్ - ఉలాగ్ దైవిక్ ఎన్ శివన్. తన శిశువులకు సంబంధించిన కొన్ని అందమైన ఫోటోలను నయన్ ఇప్పటికే షేర్ చేసింది. ఇటీవలే జన్మాష్ఠమి రోజున పంచె కట్టుతో ఇద్దరు క్యూట్ కిడ్స్ ఫోటోలను షేర్ చేసింది. పిల్లల క్యూట్ లుక్స్ ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకున్నాయి. మాలీవుడ్ యువహీరో దుల్కర్ సల్మాన్ కుమార్తె మరియం అమీరా సల్మాన్ ఫోటోలు ఇంతకుముందే అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. కూతురుతో దుల్కార్ ఘాడమైన అనుబంధం ఎప్పటికీ మరువలేనిది. దుల్కర్ కుమార్తె అందమైన చిరునవ్వు ప్రేమలో పడేలా చేస్తుంది. సౌత్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కొడుకు నీల్ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. నీల్ తో అందమైన ఫోటోలను కాజల్ నిరంతరం తన సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది. నీల్ తన తల్లిలా కనిపిస్తున్నాడనే కాంప్లిమెంట్లు అందుకున్నాడు. నేటి కిడ్స్ రేపటి పౌరులు. వీరంతా భావి భారత స్టార్లుగా ఏల్తారనడంలో సందేహం లేదు. ముఖ్యంగా నటీనటుల వారసులు కూడా నటరంగంలోనే ఎదిగేందుకు ఆసక్తిగా ఉంటారు. అయితే ఇందులో ఎవరు సూపర్ స్టార్‌డమ్ సంపాదిస్తారు? అనేది ఇప్పుడే చెప్పలేం. కొన్నిటికి కాలమే సమాధానం చెబుతుంది. నేటి చిన్నారులు పాన్ ఇండియా ఎరాలో ఎదిగేస్తున్నారు. అందుకే వీరికి సినీరంగంలో ప్రయత్నిస్తే భవిష్యత్ కూడా అంతే భారీతనంతో గ్రాండియర్ గా ఉంటుందనడంలో సందేహం లేదు.

# పవన్ పొలిటికల్ జంప్.. అయినా ఆగని హరీష్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇటీవల బ్రో మూవీతో ప్రేక్షకుల ముందుకువచ్చారు. ఈ మూవీలో పవన్ ని చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. ఆ తర్వాత కూడా ఆయన చేతిలో చాలా సినిమాలు ఉండటంతో, వరసగా సినిమాలు వచ్చేస్తాయని ఫ్యాన్స్ భావించారు. ముఖ్యంగా ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ త్వరగా పూర్తి చేస్తారని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని ఆశపడ్డారు. కానీ, ఒక్కసారిగా సీన్ అంతా రివర్స్ అయిపోయింది. సడెన్ గా పవన్ రాజకీయాలపై ఫోకస్ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సీబీఐ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పవన్ సీరియస్ అయ్యారు. వెంటనే యాక్షన్ లో దిగి, చంద్రబాబుని కలవాలని అనుకున్నారు. కానీ పోలీసులు పవన్ ని అడ్డుకున్నారు. నిజానికి ఆయన ఉస్తాద్ షూటింగ్ లో పాల్గొనాల్సి ఉంది. కానీ, ఈ సడెన్ పరిణామానికి వెంటనే రియాక్ట్ అయ్యి, విజయవాడ వెళ్లారు. పోలీసులు అడ్డుకున్నా కూడా వెనకాడకుండా, రోడ్డుపై పడుకొని మరీ నిరసన తెలిపాడు. పవన్ కి సినిమాలు చేయడం ఎంత ముఖ్యమో, రాజకీయంగా యాక్టివ్ గా ఉండటం కూడా అంతే ముఖ్యం. కాబట్టి, ఈ విషయంలో ఆయనకు ఫ్యాన్స్ మద్దతుగానే ఉన్నారు. కానీ, ఇలా పవన్ సడెన్ గా షూటింగ్స్ ఆపేయడం వల్ల నిర్మాతల పరిస్థితి ఏంటా అనే చర్చమొదలైంది. కానీ, నిర్మాతలు , దర్శకులు ఇలాంటి పరిస్థితులకు సిద్ధంగా ఉన్నారట. ఆయన ముందుగానే ఇలాంటి పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని, సిద్ధంగా ఉండమని చెప్పారట. అందుకు అంగీకరించే వారు పవన్ తో మూవీ చేస్తుండటం విశేషం. ఇక, ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ విషయానికి వస్తే, పవన్ సడెన్ గా షూటింగ్ క్యాన్సిల్ చేసి వెళ్లిపోయినా, డైరెక్టర్ హరీష్ శంకర్ షూటింగ్ ఆపేయలేదట. పవన్ లేకుండా ఇతర నటులతో ఉండే సీన్స్ ని తెరకెక్కిస్తున్నారట. ఎలా అయినా కూడా పవన్ లేకుండా ఈ మూవీ పూర్తయ్యే అవకాశం లేదు. మూవీ లైన్ లోకి వచ్చింది అనుకునేలోపు మళ్లీ ట్రాక్ తప్పుతూనే ఉంది. ఇక, ఈ మూవీలో పవన్ సరసన శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా, దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# నయనతార బాలీవుడ్ ప్లానింగ్ ఎలా?

నయనతార టాలీవుడ్..కోలీవుడ్ లో సాధించాల్సిందంతా సాధించేసింది. తెలుగులో అవకాశాలు వస్తున్నా చాలా సెలక్టివ్ గా చేస్తోంది. విఘ్నేష్ శివన్ ని వివాహం చేసుకున్న తర్వాత కోలీవుడ్ లో కూడా అంతే సెలక్టివ్ గా వెళ్తోంది. తాను చేసే ఏ సినిమా అయినా తన బ్రాండ్ ఉండేలా చూసుకుంటుంది. కమర్శియల్ చిత్రాలకంటే లేడీ ఓరియేంటెడ్ నాయికగా సత్తా చాటాలని చూస్తోంది. ఈ రెండు పరిశ్రమలో అమ్మడు ఆ రకంగా జర్నీ సాగిస్తుంది. ఈ నేపథ్యంలో నయనతార జర్నీ ఎలా ప్లాన్ చేస్తుంది? అన్నది ఆసక్తికరం. ఇటీవలే 'జవాన్' సినిమాతో హిందీలో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. జవాన్ తో బ్లాక్ బస్టర్ అందుకుంది. తొలి సినిమాతోనే ఓ రేంజ్ లో సత్తా చాటింది. షారుక్ సరసన తగ్గ నాయిక అని నిరూపించింది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రేంజ్ లో ఇప్పుడక్కడ ప్రోజెక్ట్ అవుతుంది. సాధారణంగా ఎంత హిట్ వచ్చినా తొలి సినిమాతో ఇలా ఫోకస్



అవ్వడం చిన్న విషయం కాదు. ఆ రకంగా నయనతార లక్కీ గాళ్. బాలీవుడ్ లో ఎంతో మంది హీరోయిన్లు ఉన్నా షారుక్ ఏరికోరి మరీ నయన్ దించారు. ఇక్కడే నయనతార సగం సక్సెస్ అయింది. అటుపై విజయంతో పరిపూర్ణం అయింది. అయితే అమ్మడు ఇప్పుడు హిందీలో జర్నీ ఎలా ప్లాన్ చేస్తుంది? అన్నది చూడాలి. అక్కడ స్టార్ హీరోల సరసన అవకాశాలు వస్తే నటిస్తుందా? లేదా? లేక టాలీవుడ్..కోలీవుడ్ మాదిరి సెలక్టివ్ గా వెళ్తుందా? ఇలా ఎన్నో సందేహాలు తెరపైకి వస్తున్నాయి. అయితే హిందీ పరిశ్రమలో కాంపిటీషన్ మాత్రం ఈ రెండు పరిశ్రమల్లా ఉండదు. కరీనా కపూర్..కంగనా రనౌత్..కత్రినాకైప్..దీపికా పదుకొణే.. రాణీ ముఖర్జీ..జాక్వెలిన్ పెర్నాండేజ్ లాంటి తలపండిన నాయికలు ఎంతో మంది ఉన్నారు. అలాగే యువ నాయికలు అలియాభట్...జాన్వీ కపూర్ లాంటి ఫేమస్ బ్యూటీలు కొంత మంది ఉన్నారు. వాళ్లందరి పోటీని తట్టుకుని నయన్ నిలబడాల్సి ఉంటుంది. పైగా బాలీవుడ్ ఇండస్ట్రీ విధి విధానాలు వేరుగా ఉంటాయి. పూర్తిగా దర్శక-నిర్మాతలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. దక్షిణాది పరిశ్రమలో అది చేయను..ఇది చేయను అంటే కుదరదు. అక్కడ నుంచి నెగిటివిటీ అనేది చాలా వేగంగా స్ప్రెడ్ అవుతుంది. అక్కడ సక్సెస్ అవ్వాలంటే బాండ్ అయి ఉండాల్సిందే. మరి ఇలాంటి సవాళ్ల నడుమ నయన్ జర్నీ ఎలా సాగిస్తుందన్నది ఆసక్తికరం.

# పూల చీరలో తేనెలూరే అందాలు

షిఫాన్ చీర కట్టి సందట్లో సడేమియా ఏంటో కానీ.. అలా పూల చీరలో హనీరోజ్ ఎంతో అందంగా కవ్విస్తోంది. అందానికి అందం వేడెక్కించే సొగసు ఉన్న నటిగా హనీ పేరు మార్మోగుతోంది. నటసింహా నందమూరి బాలకృష్ణ సరసన అవకాశం అందుకుంది అంటేనే హనీరోజ్ కి లక్ చిక్కిందని అర్థం. బ్లాక్ బస్టర్ అఖండ తర్వాత ఈ అమ్మడి క్రేజ్ టాలీవుడ్ లో అమాంతం పెరిగింది. ఇక రిబ్బన్ కటింగ్ ఆఫర్లకు అయితే కొదవే లేదు. ఒక్కో ఈవెంట్ కి లక్షల్లో ప్యాకేజీలు అందుకుంటోంది. తాజాగా మరో ఆకర్షణీయమైన ఫోటోషూట్ తో ఈ భామ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఈసారి క్రీమ్ కలర్ చీరలో హనీరోజ్ సౌందర్యం మంత్ర ముగ్ధులను చేస్తోంది. ముదురు గులాబీ రంగు బ్లౌజ్ కాంబినేషన్ ఎంతో ఆకట్టుకుంది. ఈ అందమైన చీరకు తగ్గట్టే మ్యాచింగ్ పింక్ చెవిపోగులు ధరించింది. ఆ ముఖంపై చెరిగిపోని అందమైన నవ్వు హనీరోజ్ కి ప్రధాన అస్సెట్ అనడంలో సందేహం లేదు.



**ఈ అందం పయనమిలా సాగింది:** హనీ రోజ్ వర్గీస్ (జననం 5 సెప్టెంబర్ 1991) ప్రముఖ మలయాళ నటి. కొన్ని తమిళ, కన్నడ, తెలుగు చిత్రాలలో కూడా కనిపించింది. 2005 మలయాళ చిత్రం బాయ్ ఫ్రెండ్‌తో తొలిసారిగా తెరకు పరిచయమైంది. 2012లో త్రివేండ్రమ్ లాడ్జ్‌లో సంచలన పాత్రతో ఆకట్టుకుంది. హనీ రోజ్ వర్గీస్ కేరళలోని మూలమట్టంలో సైరో-మలబార్ కాథలిక్ కుటుంబంలో జన్మించారు. మూలమట్టంలోని %వా.ఎ.జు.వీ% ఉన్నత పాఠశాలలో చదువుకుంది. ఆమె సెయింట్ జేవియర్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, అలువా నుండి కమ్యూనికేటివ్ ఇంగ్లీష్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని కలిగి ఉంది. 2005లో 14 ఏళ్ల వయస్సులో తన కెరీర్‌ను ప్రారంభించిన హనీ రోజ్ వినయన్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం బాయ్ ఫ్రెండ్‌లో నటించింది. ఇందులో మణికుట్టన్ స్నేహితురాలిగా నటించింది. 2007లో తన మొదటి నాన్-మలయాళ ప్రాజెక్ట్ లో నటించింది.మె మొదటి తమిళ చిత్రం రొమాంటిక్ డ్రామా ముధల్ కనవేకి సంతకం చేసింది. ముత్యాల సుబ్బయ్య 50వ చిత్రం ఆలయం (2008)లో నటించింది. నిజానికి ఆలయం హనీరోజ్ కి తెలుగు అరంగేట్ర చిత్రం. చాలా గ్యాప్ తర్వాత బాలకృష్ణ సరసన అఖండ లాంటి భారీ చిత్రంలో అవకాశం అందుకుంది. ఈ సినిమా ఘనవిజయం సాధించడంలో హనీరోజ్ పేరు మార్మోగింది.



## కేసీఆర్ నిఖార్సయిన హిందువు.. సీఎంకు దైవభక్తి మూలంగా సుభిక్షంగా రాష్ట్రం : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట : బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నిఖార్సయిన హిందువు.. ఆయనకున్న దైవభక్తి మూలంగా రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో సీతారామ చంద్రస్వామి ఆలయాన్ని మంత్రి హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.40 లక్షల నిధులతో ఆలయ పునరుద్ధరణ పనులకు మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నిఖార్సయిన హిందువు కాబట్టే రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రూ.1200 కోట్లతో యాదాద్రి టెంపుల్‌ను అభివృద్ధి చేశారు. రూ. 600 కోట్లతో కొండగట్టు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అర్చకులకు జీతాలు, ఆలయాల అభివృద్ధి కొరకు చర్యలు తీసుకుంటున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే అని స్పష్టం చేశారు. 10 000 దేవాలయాల్లో దూపాదీప నైవేద్యం కొరకు రూ.6000 వేలను రూ.10, 000కు పెంచి ఇస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. పోట్లపల్లి గ్రామంలో 140 దేవాలయాలు ఉన్నాయని, అలాంటి గ్రామంలో రూ.40 లక్షలతో రామాలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. శివాలయ గాలి గోపురం నిర్మాణానికి రూ.50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తానని తెలిపారు. కేసీఆర్ హయాంలో గత 9 సంవత్సరాల నుంచి గుంట కూడా ఎండకుండా పంటలు పండుతున్నాయని చెప్పారు. ఒకనాడు తిండి గింజలకు తిప్పలు పడ్డ మనం.. ఇవాళ రెండు పంటలు పండిస్తూ దేశానికే అన్నం పెట్టె అన్నపూర్ణగా ఎదిగాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక గౌరవెల్లి ప్రాజెక్ట్ కట్టి నీళ్లు తెచ్చింది కేసీఆర్ అని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, స్థానిక శాసనసభ్యులు ఒడితెల సతీష్ కుమార్, జెడ్పి చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు ఎప్పుడూ ఉంటయ్.. ఎన్నికలప్పుడు చేసుకోవచ్చు.. : కేటీఆర్



రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయని.. వాటిని ఎన్నికలప్పుడు చేసుకోవచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సంగారెడ్డి జిల్లాలో మోనిన్ పరిశ్రమకు కేటీఆర్ భూమిపూజ చేశారు. దేశంలోనే మొదటి యూనిట్‌ను సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మోనిన్ సంస్థ.. రూ.300 కోట్లకుపైగా పెట్టుబడితో 40ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పరిశ్రమలు వచ్చినప్పుడు అందరూ సహకరించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకు సింగిల్ విండో తీసుకువచ్చిందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టె పరిశ్రమలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. స్థానిక యువతకు ఉద్యోగం కల్పించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 400 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మీ ప్రాంతాల్లో పరిశ్రమ వస్తే సహకరించాలని కోరారు. కొంతమంది రాజకీయాలు చేస్తారని, నిజానిజాలు తెలుసుకోవాలని, ఎవరు పరిశ్రమ పెట్టినా కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ మారిందన్నారు. భారతదేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని.. తెలంగాణలో ఐదురకాల విప్లవాలు ఆవిష్కృతమవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు జాతీయ ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీనే : ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల : తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ స్పీడ్‌ను కాంగ్రెస్ నాయకులు అందుకోలేకపోతున్నారని, ఆ పార్టీకి జాతీయ ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీనే అని కవిత స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో కవిత పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ అంటే కాలువలు, చెరువులు, రిజర్వాయర్లు అని ఎప్పుడు చెబుతుంటాను.. కానీ కేసీఆర్ అంటే కైండ్ హార్టెడ్, కమిటెడ్ రెస్పాన్సిబుల్ లీడర్ అని కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మమూలు మనిషి కాదు. ఇలాంటి నాయకులు చాలా తక్కువ మంది ఉంటారు. మన తెలంగాణకు అలాంటి నాయకుడు దొరికారు. తెలంగాణ ఉద్యమం కొనసాగించిన పార్టీనే అధికారంలోకి వచ్చింది అని కవిత తెలిపారు. రేపట్నుంచి హైదరాబాద్ వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్నాయని, ఇక గాంధీ పరివారం అంతా ఇక్కడికి వస్తోంది అని కవిత పేర్కొన్నారు. మొన్న ఖర్గే వచ్చి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఇచ్చారు. మేం వచ్చి పోడు పట్టాలు ఇస్తామంటున్నారు. అసలు వీళ్ల అప్‌డేట్ కారా..? మొన్ననే మనం పోడు పట్టాలు ఇచ్చేశాం. రాహుల్ గాంధీ అప్‌డేట్ లేని ఔట్‌డేటెడ్ నాయకుడు అయిపోయారు. ఆయనకు ఆలోచన లేదు. కేసీఆర్ స్పీడ్‌ను అందుకోలేరు. రాహుల్ గాంధీ మోదీని ఆపలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీకి జాతీయ ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీనే అని కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయింది. దేశంలో కాంగ్రెస్ పార్టీని తిరస్కరిస్తున్నారు. అలాంటి పార్టీని జగిత్యాలలోనూ ఓడించాలి. తెలంగాణలో ఊహకందని అభివృద్ధి జరుగుతుంది. దీంతో ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కాంగ్రెస్ నేతల మాటలు విని మోసపోవద్దు. తెలంగాణ ప్రజలకు గులాబీ పార్టీ శ్రీరామరక్ష. కేసీఆర్ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ ఉంది. కాబట్టి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలి. తెలంగాణ అంటే ఒకనాడు విషాదగాథ ఇప్పుడు తెలంగాణ అంటే విజయగాథ అని కవిత పేర్కొన్నారు.

## సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడు



సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడని.. ఈ పనికిరాని చెత్త ప్రతిపక్ష పార్టీలు కళ్ళు ఉండి చూడలేని పరిస్థితుల్లో ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శలు గుప్పించారు. బుధవారం మర్కుక్ మండలం కొండపోచమ్మ సాగర్‌లో 14 లక్షల 35 వేల చేప పిల్లలను మంత్రి వదిలారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు మత్స్యకారులు ఉన్నారనే విషయం మరిచిందని.. 100 శాతం ఉచ్చితంగా చేప పిల్లలను పంపిణీ చేసేది తెలంగాణ రాష్ట్రమే అని అన్నారు. మటన్, చికెన్ కంటే చేపలతోనే ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు చెపుతున్నారన్నారు. చేపలు పట్టుకునే వారికి 4 లక్షల ఐడీ కార్డులు.. వేయి కోట్ల రూపాయలతో వాహనాలు, జాలరులకు రైన్ కోర్టులను ప్రభుత్వం అందించిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ మెంబర్షిప్ ఉండాలనేది ప్రభుత్వం లక్ష్యమని.. కొంత మంది మూర్ఖులకు కళ్ళు కనిపించవని మండిపడ్డారు. కొండ పోచమ్మలో నీళ్లు లేవు ఉట్టిగానే కట్టారని కొంతమంది ప్రతిపక్ష నేతలు మాట్లాడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్నికల విషయంలో బీఆర్ఎస్ కన్ఫ్యూజ్ చేస్తోందంటూ జీవన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం గురించి కేటీఆర్ మాట్లాడడం ఆశ్చర్యం వేస్తుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 2004 సాధారణ ఎన్నికల్లో కేటీఆర్ ఎక్కడ కనిపించలేదు ఎందుకు? అప్పుడు అమెరికాలో కేటీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ మంత్రి అయిన తర్వాత కేటీఆర్, కవితఃలు తెలంగాణకు వచ్చారన్నారు. అనవసరంగా కేసీఆర్ తెలంగాణ నినాదం ఎత్తుకున్నారని కేటీఆర్ అన్న మాటలకు చాలా మంది సాక్షులు ఉన్నారని తెలిపారు. ఏపీలో పార్టీ ఉనికిపోతుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చిన చరిత్ర తమది అని చెప్పుకొచ్చారు. ఆకాశం మీద నుంచి ఊడిపడినట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ తల్లి మీద ఓట్టేసి మందు, పైసల్ పంచకుండా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రమాణం చేసే దమ్ముందా? అని ఎమ్మెల్సీ సవాల్ విసిరారు. రెండో ప్రభుత్వంలో ఒక్క కొత్త డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించలేదన్నారు. ఎన్నికల కోసమే కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. దళితబంధుకు ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ళు లేని గ్రామం లేదన్నారు. అధికార పార్టీలో చేరితేనే దళితబంధు, బీసీ బందు, డబుల్ బెడ్ రూమ్ అంటున్నారని.. ఇదే నా కేటీఆర్ దృష్టిలో పారదర్శకత అంటే అని ప్రశ్నించారు. కలెక్టర్‌లు బీఆర్ఎస్ తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల నుంచి అప్లికేషన్స్ తీసుకోకుండా లబ్ది దారులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు బోమ్మా, బొరుసు లాంటివని.. బీజేపీ సహకారంతోనే గతంలో బీఆర్ఎస్ ముందస్తుకు వెళ్లిందన్నారు. అమిత్ షా చేతిలో కేసీఆర్ జుట్టు ఉందని వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల విషయంలో బీఆర్ఎస్ కన్ఫ్యూజ్ చేస్తుందని.. ఇందులో కేటీఆర్ కూడా భాగస్వామే అంటూ జీవన్ రెడ్డి దుయ్యబట్టారు.




హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు కదం తొక్కారు. విప్రో సర్కిల్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించిన ఐటీ ఉద్యోగులు చంద్రబాబు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు.

ఆయామ్ విత్ సీబీఎన్ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకు దిగిన ఐటీ ఉద్యోగులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. దీంతో విప్రోకూడలిలో ఉద్రిక్తత నెలకొంది.

**వచ్చే ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం..** "చంద్రబాబుకు అవినీతి మరకలు అంటించేందుకు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి జైల్లో పెట్టారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. కక్ష సాధించేందుకే బాబును జైల్లో పెట్టారు. ఆయన వల్లే మాకు ఉపాధి అవకాశాలు లభించాయి. మా జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబుకు అండగా ఉంటాం. సైకో పోవాలి.. సైకిల్ రావాలి. కక్ష సాధింపు రాజకీయాలు అభివృద్ధికి విఘాతం. వచ్చే ఎన్నికల్లో మా తడాఖా చూపిస్తాం" అని ఐటీ ఉద్యోగులు హెచ్చరించారు.




## జగనొక మెంటల్.. ఏమైనా చేస్తాడు.. చంద్రబాబుకు అంతా అండగా నిలవాలి

ఖమ్మం : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చాలా పెద్ద ప్రమాదంలో ఉన్నారని మాజీ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. నేడు ఆమె ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రాజమండ్రి జైలు చంద్రబాబుకు సేఫ్ కాదన్నారు. సొంత బాబాయినే చంపుకున్న వాడికి చంద్రబాబు ఒక లెక్కా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడికి అందరూ అండగా నిలవాలన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. చంద్రబాబు కేసును సుప్రీం సుమోటోగా తీసుకుని విచారించాలన్నారు. ఇంకా రేణుకా చౌదరి మాట్లాడుతూ.. "కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించాలి. చంద్రబాబుకు కేంద్రం జాతీయ స్థాయిలో పటిష్టమైన భద్రత కల్పించాలి. చంద్రబాబు ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. జగనొక మెంటల్. జగన్‌కు నా సొంత ఖర్చుతో మానసిక చికిత్స చేయిస్తా. రాజ్యాంగంలో మార్పులు తేవాలి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నాయకులంతా తాము మానసికంగా ఫిట్‌గా ఉన్నామని నిరూపించుకోవాలని చట్టం చేయాలి. జగన్ మానసిక స్థితి సరిగా లేదు... ఏమైనా చేస్తాడు. బంగారం లాంటి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు" అని పేర్కొన్నారు.




## భాజపాలో చేర్చుకోకపోవడంపై చీకోటి ప్రవీణ్ ఘాటు వ్యాఖ్యలు

తనను భాజపాలో చేర్చుకోకపోవడంపై చీకోటి ప్రవీణ్ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు వీడియో విడుదల చేశారు. తనంటే భయం ఏంటో అర్థమైందని, ఏ శక్తులు తనని ఏమీ చేయలేవని అన్నారు. 'కుళ్లు రాజకీయాలు చేస్తున్న వాళ్లకు సవాల్ విసురుతున్నా. మీలా వెన్నుపోటు రాజకీయాలు నాకు రావు. మీ రాజకీయం మీరు చేయండి.. నా రాజకీయం నేను చేస్తా' అని చీకోటి పేర్కొన్నారు.

## నయా రాజాకార్ల పార్టీని.. కేసీఆర్ రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తాం



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. "మజ్లిస్ కోసమే సీఎం కేసీఆర్ జాతీయ సమైక్యత దినోత్సవం జరుపుతున్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం పబ్లిక్ గార్డెన్ లో కాదు దారుసలాంలో జరుపుకోవాలి. కేసీఆర్ జమిలి ఎన్నికలంటే గజగజ వణికిపోతున్నారు. కేంద్రం జమిలి ఎన్నికలు జరుపుతామని ఇంకా స్పష్టం చేయలేదు. కేంద్రం చెప్పేవరకు ఓపిక లేకుండా కేసీఆర్ కుటుంబం వణికిపోతుంది. మంత్రివర్గంలో అందరూ దమ్మిలే.. ఒక్కరికీ పవర్ లేదు.

మంత్రివర్గం కంటే కేసీఆర్ కు సలహాదారులే ఎక్కువ. బీఆర్ఎస్, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగాలు రావు, జీతాలు రావు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఉద్యోగాలు, జీతాలు వస్తాయి. పేద వాళ్లు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను కేసీఆర్ నిర్వీర్యం చేశారు. జమిలి ఎన్నికలు వచ్చిన, సింగల్ గా జరిగిన తెలంగాణలో కమలం వికసిస్తుంది. ఒక కుటుంబం చేతిలో తెలంగాణ సర్వ నాశనం అయ్యింది. కాంగ్రెస్ లో ఎమ్మెల్యేలు గెలిస్తే బీఆర్ఎస్ లోకే పోతారు. నయా రాజాకార్ల పార్టీని.. కేసీఆర్ రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తాం. నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో రామరాజ్యం తెస్తాం." అని బండి సంజయ్ అన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత ప్రయాణం.. ప్రయోగాత్మకంగా బండ్లగూడ డిపోలో అమలు

హైదరాబాద్ : ఆర్టీసీలోని అన్ని రకాల బస్సుల్లో త్వరలో నగదు రహిత చెల్లింపుతో ప్రయాణం చేసే వెసులుబాటు రానుంది. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ సహా ఆపై స్థాయి బస్సులన్నింటిలోనూ ఐ-టిమ్స్ పరికరాలను అందుబాటులోకి తేనున్నారు. దీంతో డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు గూగుల్ పే, ఫోన్ పే వంటి వాటితో ప్రయాణికులు తమ టికెట్ ధరను చెల్లించి, బస్సుల్లో ప్రయాణించొచ్చు. ఈ మేరకు బండ్లగూడ బస్‌డిపోను ఆర్టీసీ అధికారులు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డిపోలోని ఆర్డినరీ, మెట్రో సహా మొత్తం 145 బస్సుల్లో ఐ-టిమ్స్‌ను వాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బండ్లగూడ డిపోలో అమలు చేసిన అనంతరం కంటోన్మెంట్ డిపోలో అమలు చేయనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,300 బస్సుల్లో దశల వారీగా ప్రవేశపెట్టేలా కార్యాచరణ రూపొందించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com